తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 109 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 శుక్రవారం 20 - 11 - 2026 వెల రూ. 2 రూ/

మంచి రోడ్లతోనే

దేశాభివృద్ధి సాధ్యం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- మంచి రోడ్లు లేకుండా ఏ దేశం కూడా అభివృద్ధి చెందదు
- దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు
- ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ ప్రారంభ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు
- హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు



హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలో రహదారులతో పాటు ఇతర మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 వరకు రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకనామీ చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సును కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. 'కనెక్టింగ్ రోడ్స్ క్రియేటింగ్ టుమారో' ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో పెట్టుబడుల సాధనలో సమ్మిట్ కీలకమని తెలిపారు."మంచి రోడ్లు లేకుండా ఏ దేశం కూడా అభివృద్ధి చెందదు. ధనిక, అభివృద్ధి చెందిన దేశాలు గొప్ప రోడ్లను నిర్మించవు. గొప్ప రోడ్లే దేశాలను ధనిక, అభివృద్ధి చెందిన దేశాలుగా మారుస్తాయి. పారిశ్రామిక క్లస్టర్లను అనుసంధానించే బలమైన రోడ్ నెట్‌వర్క్‌ను - మిగతా 2 లో

కోమటిరెడ్డి మీ అనుచరుడు

అన్నీ ఆయనే చూసుకుంటారు



- నితిన్ గడ్కరీతో రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు
- హైదరాబాద్ హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైన 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ సదస్సు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి 9 కీలక ప్రాజెక్టుల జాబితా సమర్పించిన కోమటిరెడ్డి
- వేదికపై ఆత్మీయ వ్యాఖ్యలతో నవ్వులు పూయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హరీశ్ రావు అవినీతిపై చర్యలేవి?

- సీఎంఓకు పంపిన లేఖలు 'ఎక్స్'లో పంచుకున్న కవిత
- సిద్దిపేటలో సీఎం పర్యటన వేళ కల్వకుంట్ల కవిత ట్వీట్
- హరీశ్ అవినీతిపై ఆధారాలు ఉన్నాయి చర్యలు ఎప్పుడు తీసుకుంటారని కవిత ప్రశ్న
- హరీశ్ రావును టార్గెట్ చేసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్ :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన వేళ, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో హరీశ్ రావు భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ - మిగతా 2 లో

తిరుమలకు కూడా ఎల్‌నినో ఎఫెక్ట్

అప్రమత్తమైన టీటీడీ

- తిరుమలలో రోజుకు 50 నుంచి 60 లక్షల గ్యాలన్ల నీటి వినియోగం
- ప్రస్తుతం ఉన్న నిల్వలు 120 రోజులకు సరిపోతాయని అంచనా
- హోటళ్లు, మఠాలకు రోజుకు రెండు గంటలే నీటి సరఫరా



అమరావతి :

తిరుమలలో శ్రీవారి భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అప్రమత్తమైంది. ఎండల తీవ్రత, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గుతుండటంతో ముందస్తుగా నీటి పొదుపు, - మిగతా 2 లో

వచ్చే 20 ఏళ్ల పెట్టుబడుల్లో

'ఇండియా ఫస్ట్'



- పరిశ్రమలకు ప్రధాని మోదీ పిలుపు
- వ్యవసాయ రంగంలో పెట్టుబడులను మరింత పెంచాలని పారిశ్రామిక రంగానికి మోదీ పిలుపునిచ్చారు
- అభివృద్ధి పథంలో సాగాలంటే ఎప్పటికప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవడం ఆయన అవసరమన్నారు

ఢిల్లీ :

భారత్‌ను స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దడంలో పరిశ్రమల పాత్ర ఎంతో కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాబోయే 20 ఏళ్లలో ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయంలోనూ - మిగతా 2 లో



ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయను

- మాజీ సీఎం కీలక నిర్ణయం
- రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనన్న సిద్ధరామయ్య
- వయోభారం వల్లే పోటీకి దూరంగా ఉంటున్నట్లు వెల్లడి
- సోనియా పుస్తకావిష్కరణ సభలో సీటింగ్ వివాదంపై స్పష్టీకరణ
- సభకు ఆలస్యంగా వెళ్లడం వల్లనే వెనుక కూర్చున్నానని వివరణ

బెంగళూరు :

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేసే ప్రసక్తే లేదని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య - మిగతా 2 లో

బంగాళాఖాతంలో కొనసాగుతున్న

తీవ్ర తుపాను 'అక్వాన్'



- నేడు గోపాల్‌పూర్ వద్ద తీరం దాటే అవకాశం
- పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా కొనసాగుతున్న అక్వాన్
- ఉత్తరాంధ్రలో 80 కిలోమీటర్ల వేగంతో వీచనున్న ఈదురుగాలులు
- తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న విపత్తుల నిర్వహణ సంస్థ
- మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని అధికారుల స్పష్టీకరణ

ఒక్క రాత్రిలో

4,250 మంది కోటీశ్వరులు

- ఆంత్రోపిక్ ఐపీవోతో కాసుల వర్షం!
- సంస్థలోని దాదాపు 70 శాతం మంది ఉద్యోగులకు భారీ సంపద
- ఏడుగురు వ్యవస్థాపకులకు ఒక్కొక్కరికి రూ.2,600 కోట్ల లాభం
- ఫౌండర్లకు మొత్తంగా రూ.18,300 కోట్లకు పైగా ఆదాయం
- ఐపీవో ద్వారా ఏకంగా రూ.7.6 లక్షల కోట్ల నిధుల సేకరణ
- కంపెనీ మొత్తం మార్కెట్ విలువ రూ.140 లక్షల కోట్లకు చేరిక



ఏపీలో 3 ఎకనమిక్ రీజియన్ల

ప్రణాళికలు సిద్ధం

- రూ.4.6 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా చంద్రబాబు సమీక్ష
- విశాఖ, తిరుపతి, అమరావతి రీజియన్ల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ఫోకస్
- అమరావతి ప్రాంతంలో 48 ప్రాజెక్టుల ద్వారా రూ.4.65 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో 167 పనుల ప్రణాళిక.. 64 పనులు ఇప్పటికే ప్రారంభం
- విశాఖ ఐటీ రంగం ద్వారా 2 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ
- వైజాగ్ బే సిటీ యాంకర్ ప్రాజెక్టుగా, మధురవాడ, కాపులుప్పాడలో డేటా సెంటర్లు



అమరావతి :

రాష్ట్ర సమగ్ర ఆర్థిక పురోగతికి ఊతమిచ్చేలా విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్ల అభివృద్ధిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మూడు రీజియన్లలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల పురోగతి, పరిశ్రమల గ్రౌండింగ్ తదితర అంశాలపై అధికారులు సమగ్ర ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రాంతాలవారీగా ప్రత్యేక వనరులను ఆధారంగా చేసుకొని పెట్టుబడులను ఆకర్షించడం, భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ఎజెండాగా ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం రూపొందించింది.ఉత్తరాంధ్ర కేంద్రంగా ఉన్న విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) పరిధిలో పోర్టులు, ఐటీ, డేటా సెంటర్లు, భారీ పరిశ్రమలకు పెద్దపీట వేస్తున్నారు. ఇక్కడ ప్రతిపాదించిన 167 ప్రాజెక్టుల్లో ఇప్పటికే 64 పనులను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ప్రాంతానికి 'వైజాగ్ బే సిటీ' యాంకర్ ప్రాజెక్టుగా నిలవనుండగా.. మధురవాడ, కాపులుప్పాడ, ఆనందపురంలో ఐటీ, డేటా సెంటర్ హబ్‌లను అభివృద్ధి చేస్తున్నారు. - మిగతా 2 లో

అధ్యక్ష పీఠం కోసం పార్టీలు

ఎత్తుకు పైఎత్తులు

- రాష్ట్రంలో ఎంపీపీ ఎన్నికల సందర్భంగా పలు చోట్ల ఉత్కంఠ పరిస్థితులు
- ఎలాగైనా ఎంపీపీ అధ్యక్ష స్థానాన్ని దక్కించుకోవాలని పార్టీలూ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి

అమరావతి :

రాష్ట్రంలో ఎంపీపీ ఎన్నికల సందర్భంగా పలు చోట్ల ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని మండలాల్లో కూటమి, వైఎస్సార్సీపీ బలాబలాలు దాదాపు సమానంగా ఉండటంతో ఎంపీపీ పదవులు ఎవరికి దక్కుతాయనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ఎలాగైనా మండల పరిషత్ అధ్యక్ష స్థానాన్ని దక్కించుకోవాలని రెండు పార్టీలూ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. స్వతంత్రులుగా గెలిచిన - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 20 - 11 - 2026

సంపాదకీయం

ఈ వాయుకాలుష్య కౌగిలి వీడేదెలా?

ఏటా దీపావళి దగ్గర పడుతున్నప్పుడూ ఆ తరువాతా 'ఢిల్లీ విషగాలి' గురించి వింటూనే ఉంటాం. ఢిల్లీ వాసులు నిద్రలేవగానే నగరమంతా దట్టమైన పొగ, పొగమంచు కమ్ముకుని ఉండటాన్ని చూస్తారు. దేశ రాజధాని పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం, ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సురక్షిత స్థాయి కంటే 30 రెట్లు ఎక్కువగా ఉంది. నేడు ప్రపంచంలోనే గాలి నాణ్యత ప్రమాదకర స్థాయిలో ఉన్న నగరాల్లో ఢిల్లీ ఒకటి. ప్రపంచవ్యాప్తంగా అధిక రక్తపోటు (బీపీ) తర్వాత ప్రాణాలు తీస్తున్న రెండో అతిపెద్ద కారణం వాయు కాలుష్యమే; ఇది ఢిల్లీలో ఏటా సుమారు 17,188 మరణాలకు కారణమవుతోంది.రోడ్లపై రోజూ తిరిగే 91 లక్షల వాహనాలు ఢిల్లీ కాలుష్యానికి 50శాతం వరకు కారణం. రెండవది, ఢిల్లీలోని పారిశ్రామిక కారిడార్. 11 బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల మొత్తం సూక్ష్మ ధూళి కణాలలో సుమారు 8శాతం వరకు గాలిలో కలుస్తున్నాయి. వీటికి తోడు, నియంత్రణ లేని పరిశ్రమలు, డీజిల్ జనరేటర్ల అతివాడటం వల్ల ప్రమాదకరమైన భార లోహాలు, సల్ఫర్ ఆక్సైడ్లు గాలిలోకి చేరుతున్నాయి. ఫరీదాబాద్, గురుగ్రామ్, నోయిడా, ఘజియాబాద్ వంటి పారిశ్రామిక కేంద్రాలు, ఢిల్లీ పారిశ్రామిక ప్రాంతాలలోని లోహపు పరిశ్రమలు, రసాయన కర్మాగారాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, పాత ఇటుక బట్టీల వంటివి చుట్టుముట్టి ఉన్నాయి. కఠినమైన నిబంధనలను పాటించని చెత్త నుండి విద్యుత్ తయారు చేసే ప్లాంట్లు కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి. పక్క రాష్ట్రాల్లో వరి కోతల తర్వాత పంట వ్యర్థాలు తగలబెట్టడం వాయుకాలుష్యానికి 10శాతం వరకు కారణమవుతోంది. ఎన్‌సీఆర్ గాలి నాణ్యత చెడిపోవడంలో విమానయాన రంగం పాత్ర చాలా పెద్దది. ప్రతిరోజూ 1,300 విమానాల రాకపోకలతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం దక్షిణాసియాలోనే అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాలలో ఒకటి. విమానాలు దిగేటప్పుడు, ఎగిరేటప్పుడు భారీ మొత్తంలో సూక్ష్మ ధూళి కణాలు, పూర్తిగా తగలబడని హైడ్రోకార్బన్లు, కార్బన్ మోనాక్సైడ్ విడుదలవుతాయి. ఢిల్లీ వాయు కాలుష్యంలో దాదాపు 7శాతం వాటా దీనిదే. భౌగోళికంగా ఢిల్లీ ఒక 'గిన్నె' ఆకారంలో పల్లపు ప్రాంతంలో ఉండి, చుట్టూ ఎత్తైన భూభాగాలతో చుట్టుముట్టి ఉంది. దీనితో గాలి బయటకు పోకుండా లోపలే చిక్కుకుపోతుంది. పైన పేర్కొన్న వివిధ కారణాల రీత్యా తయారైన కార్బన్ మోనాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్లు, సల్ఫర్ డయాక్సైడ్‌ల విషపూరిత మిశ్రమమే ఆ పొగమంచు (స్మాగ్). గాలి వేగం దాదాపు సున్నాకి పడిపోవడంతో, ఢిల్లీ, దాని చుట్టుపక్కల ఉన్న కాలుష్యం ఎటూ చెదిరిపోలేక, అన్ని వైపుల నుండి వచ్చే దుమ్ము, మసితో నగరవాసులకు ఊపిరాడకుండా చేస్తోంది. 150 కోట్ల ఏళ్ళ నాటి ప్రాచీన ఆరావళి పర్వతశ్రేణులలో అదుపులేని అటవీ నిర్మూలన, నిర్మాణ కార్యకలాపాల పెరుగుదల ఆందోళన కలిగించే అంశం. రాజధాని ప్రాంతానికి ఊపిరితిత్తులుగా, సహజ నీటి పరీవాహక ప్రాంతంగా, పర్యావరణ రక్షణ కవచంగా పనిచేసే ఈ పర్వత శ్రేణి నాశనం కావడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది.ఈ శతాబ్దం మొదటి దశాబ్దం వరకు, బీజింగ్ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాలలో ఒకటి. కానీ భారీ ప్రభుత్వ పెట్టుబడి, ప్రాంతీయస్థాయిలో సమన్వయం, హై-టెక్ పర్యవేక్షణతో ఒక కఠినమైన కాలుష్య వ్యతిరేక పోరాటం ద్వారా 2013--2023 మధ్య కాలంలో ఆ నగరం సూక్ష్మ ధూళి కణాల కాలుష్యాన్ని 64శాతానికి పైగా తగ్గించుకోగలిగింది. చైనా ప్రభుత్వం లక్షలాది ఇళ్లలోని బొగ్గు పొయ్యిలను, వేలాది పారిశ్రామిక, మున్సిపల్ బొగ్గు బాయిలర్లను అతివేగంగా సహజ వాయువు (గ్యాస్) లేదా విద్యుత్‌తో భర్తీ చేసింది. నగర పరిధిలో బొగ్గు విద్యుత్ కేంద్రాలను నిషేధించింది. స్టీల్ ప్లాంట్ సహా వందలాది భారీ కాలుష్యకారక ఫ్యాక్టరీలను, పారిశ్రామిక సముదాయాలను సుదూర ప్రాంతాలకు తరలించింది. రవాణా రంగంలో లక్షలాది పాత కాలుష్య వాహనాలను తుక్కుగా మార్చి, ఎలక్ట్రిక్ వాహనాలకు మారింది. జాతీయ ఉద్గార ప్రమాణాలను అందుకోలేని భారీ సరుకు రవాణా ట్రక్కులను నిషేధించింది. సాంకేతికత, పర్యవేక్షణలతో పాటు నగర పొరుగు ప్రాంతాలతో సమన్వయం, జవాబుదారీతనం సాధించింది. ప్రధానంగా అడవుల పెంపకాన్ని అమలు చేసి, స్థానిక అధికారులకు పర్యావరణ లక్ష్యాలను నిర్దేశించింది. దుమ్ము, ఇసుక తుఫానులను ఎదుర్కోవడానికి కోట్లాది చెట్లను నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని 64శాతం వరకు తగ్గించి, బీజింగ్‌ను స్వచ్ఛమైన నగరంగా మార్చింది.

ఏపీలో 3 ఎకనమిక్ రీజియన్ల ప్రణాళికలు సిద్ధం

మొదటిపేజీ తరువాయి - మరో 15 నుంచి 20 నూతన ఐటీ సంస్థలను విశాఖకు రప్పించడంతో పాటు, ఐటీ రంగంలో 2 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించారు. దీనితో పాటు స్టీల్ సిటీ, కాకినాడ ఇండస్ట్రియల్ సిటీ, పోర్టుల విస్తరణ, కోనసీమ బ్యాక్ వాటర్స్ అభివృద్ధి, అరకు, మారేడుమిల్లిలో ఎకో టూరిజం ప్రాజెక్టులపై దృష్టి సారించారు.రాయలసీమను సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, గ్రీన్ ఎనర్జీ రంగాలుగా తీర్చిదిద్దుతూ తిరుపతి ఎకనమిక్ రీజియన్ (టీఈఆర్) ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని 87 గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో 66 ప్రాజెక్టులు ఈ రీజియన్ పరిధిలోనే ఏర్పాటు కానుండటం విశేషం. స్పేస్, ఎయిర్ క్రాఫ్ట్, డిఫెన్స్, ఈవీ పరిశ్రమలతో పాటు హార్టికల్చర్ హబ్‌లో భాగంగా డెయిరీ, పౌల్ట్రీ, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ క్లస్టర్లు రానున్నాయి. ఈ రీజియన్‌లోని 14 పట్టణాలను వివిధ రంగాల పారిశ్రామిక నగరాలుగా మార్చనున్నారు.మరోవైపు అమరావతి రీజియన్‌లో క్వాంటం టెక్నాలజీ, ఐటీ, లాజిస్టిక్స్, అగ్రి వాల్యూ చైన్ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇక్కడ 48 భారీ ప్రాజెక్టుల ద్వారా ఏకంగా రూ.4.65 లక్షల కోట్ల పెట్టుబడులను గ్రౌండింగ్ చేసేలా ప్రణాళికలు ఖరారు చేశారు. మచిలీపట్నం, రామాయపట్నం పోర్టుల పనులను వేగవంతం చేసి ఎగుమతులకు ఊతమివ్వడంతో పాటు సూర్యలంక, ఓడరేవు, రామాపురం, నిజాంపట్నం, డిండి తీర ప్రాంతాలను కోస్టల్ టూరిజం హబ్‌లుగా అభివృద్ధి చేయనున్నారు.

కోమటిరెడ్డి మీ అనుచరుడు

మొదటిపేజీ తరువాయి - హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ (×=జ) వార్షిక సదస్సు కొనసాగుతోంది. ఈ ప్రారంభోత్సవ వేదికపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మధ్య ఆసక్తికరమైన, ఆత్మీయ వాతావరణం కనిపించింది.కార్యక్రమంలో భాగంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలంగాణ రహదారుల నెట్‌వర్క్ విస్తరణకు సంబంధించి కీలక ప్రాజెక్టుల జాబితాను కేంద్ర మంత్రికి సమర్పించారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా విస్తరించడం, హైదరాబాద్-శ్రీశైలం 61 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు మొత్తం 9 ప్రధాన ప్రాజెక్టుల ప్రతిపాదనలను ఆయన కేంద్రం ముందు ఉంచారు.అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... మంత్రి కోమటిరెడ్డి అందించిన ప్రాజెక్టుల జాబితాను ప్రస్తావిస్తూ సరదాగా చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. సీఎం మాట్లాడుతూ.. "నా సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు మన రాష్ట్ర అవసరాల పెద్ద జాబితానే మీకు ఇచ్చారు. నేను వాటిని మళ్లీ రిపీట్ చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే కోమటిరెడ్డి గారు మీ శ్రేయోభిలాషి, మీ అనుచరుడు, మీ వీరాభిమాని. ఆయనే అన్నీ చూసుకుంటారు. వాటి గురించి నేను పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు" అని వ్యాఖ్యానించారు. దీంతో గడ్కరీతో సహా సభలోని వారంతా నవ్వుల్లో మునిగిపోయారు.రహదారుల అభివృద్ధి ద్వారానే ప్రాంతీయ ప్రగతి సాధ్యమవుతుందని, రాజకీయాలకు అతీతంగా ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ముందుకు సాగాలని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ సదస్సు నవంబర్ 22 వరకు కొనసాగనుంది.

హరీశ్ రావు అవినీతిపై చర్యలేవి?



మొదటిపేజీ తరువాయి - ముఖ్యమంత్రి కార్యాలయానికి (సీఎంఓ) తాను అందజేసిన ఫిర్యాదు పత్రాలను ఈరోజు ఆమె సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు."అవినీతికి సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. మరి చర్యలు ఎప్పుడు తీసుకుంటారు సీఎం గారూ?" అంటూ కవిత నేరుగా రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ నెల 14న సీఎంఓకు సమర్పించిన ఈ లేఖలను అధికారులు నవంబర్ 18న స్వీకరించారు. కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణం, డిజైన్ మార్పులు, పంప్ హౌస్ పనుల్లో తీవ్ర నాణ్యతా లోపాలు జరిగాయని ఆమె ఆరోపించారు."సిద్ధిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో జరిగిన అవినీతి, డిజైన్ మార్పు, నాణ్యతా లోపాలు జరిగినట్లుగా మా దృష్టికి వచ్చిన అంశాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ వరకు నీటిని తరలించే కాలువ డిజైన్‌లో మార్పులు, పంప్ హౌస్ నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టిన విచారణకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం" అని కవిత తన ఫిర్యాదులో స్పష్టం చేశారు.

అధ్యక్ష పీఠం కోసం పార్టీలు ఎత్తుకు పైఎత్తులు



మొదటిపేజీ తరువాయి - ఎంపీటీసీలను తమ వైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పాములపాడు మండలంలో టీడీపీ 5, వైఎస్సార్సీపీ 5 స్థానాల్లో విజయం సాధించగా స్వతంత్ర అభ్యర్థి ఒక చోట గెలుపొందారు. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థి మద్దతిచ్చే పార్టీకి ఎంపీపీ పదవి దక్కే అవకాశముంది. కోడుమూరులో టీడీపీ 9, వైఎస్సార్సీపీ 10, సీపీఎం, స్వతంత్ర అభ్యర్థి ఒక్కోచోట గెలుపొందారు. ఎంపీపీ ఎన్నికలో సీపీఎం, స్వతంత్ర అభ్యర్థులు కీలకం కానున్నారు.విజయనగరం జిల్లా గుర్ల ఎంపీపీ స్థానంపై ఉత్కంఠ నెలకొంది. 18 ఎంపీటీసీ స్థానాలకు వైఎస్సార్సీపీ, కూటమి పక్షాలు చెరో 9 స్థానాలు కైవసం చేసుకున్నాయి. లాటరీ పద్ధతి ద్వారా గుర్ల ఎంపీపీని ఎన్నుకునే అవకాశముంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో ఎంపీపీ పదవి కోసం ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొంది. వైఎస్సార్సీపీ 9, కూటమి 8 స్థానాల్లో విజయం సాధించాయి. ఎంపీపీ ఎన్నికకు ఒకరు గైర్హాజరు కావడంతో ఉత్కంఠ నెలకొంది.నెల్లూరు జిల్లా సైదాపురంలో టీడీపీ, వైఎస్సార్సీపీకి సమానంగా స్థానాలు వచ్చాయి. టాస్ ద్వారా ఎంపీపీ పదవిని తేల్చనున్నారు. వింజమూరులో వైఎస్సార్సీపీకి ఎంపీటీసీల మద్దతు దృష్ట్యా ఆ పార్టీకి ఎంపీపీ దక్కే అవకాశముంది.తిరుపతి జిల్లా వెంకటగిరిలో 8 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ, వైఎస్సార్సీపీ చెరో 4 స్థానాల్లో విజయం సాధించాయి. లాటరీ ద్వారా ఎంపీపీని ఎంపిక చేసే అవకాశముంది. టీడీపీ నుంచి ఎంపీపీ అభ్యర్థిగా రాజేశ్వరి పేరు ఖరారైంది. వైఎస్సార్సీపీ ఇప్పటి వరకు అభ్యర్థిని పేరు ప్రకటించలేదు.అనంతపురం శింగనమల ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. శింగనమలలో వైఎస్సార్సీపీ, టీడీపీకి సమానంగా ఎంపీటీసీ స్థానాలు వచ్చాయి. ఎంపీపీ ఎన్నికపై టీడీపీ ఎంపీటీసీల్లో అంతర్గత విభేదాలు తలెత్తాయి. దీంతో ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఇరువర్గాల వారిని లాఠీలతో చెదరగొట్టారు.కృష్ణా జిల్లా ఉంగుటూరులో ఎంపీపీ ఎన్నిక రసవత్తరంగా జరిగింది. 16ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ 8, వైఎస్సార్సీపీకి 7, సీపీఎం ఒకచోట స్థానాలు గెలుపొందారు. అయితే వైఎస్సార్సీపీకి సీపీఎం అభ్యర్థి మద్దతుతో ప్రకటించడంతో ఎంపీపీ ఎన్నిక ఉత్కంఠగా మారింది. చివరికి లాటరీ పద్ధతిలో ఎంపీపీ ఎన్నికకు అధికారుల నిర్ణయించారు. ఎంపీపీ పదవికి టీడీపీ తరఫున సుజిత, వైఎస్సార్సీపీ నుంచి గంగాలక్ష్మి పోటీ చేశారు. చివరికి లాటరీ పద్ధతిలో టీడీపీ అభ్యర్థి సుజితను ఎంపీపీ పదవి వరించింది.

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుపాను 'అక్వాన్'

మొదటిపేజీ తరువాయి - పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తీవ్ర తుపానుగా కొనసాగుతోంది. ఇది ప్రస్తుతం ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాల వైపు వేగంగా కదులుతోంది. ప్రస్తుత సమాచారం ప్రకారం.. ఈ తీవ్ర తుపాను నరసాపురానికి 390 కిలోమీటర్లు, కళింగపట్నానికి 350 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు 430 కిలోమీటర్లు, పూరీకి దాదాపు 490 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది మరింత ముందుకు కదిలి, శుక్రవారం (నవంబరు 20) మధ్యాహ్నానికి నరసాపురం-పూరీ మధ్యలోని గోపాల్‌పూర్ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.ఈ తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వాతావరణం వేగంగా మారుతోంది. తీరం వెంబడి గంటకు 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 80 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి.తుపాను తీవ్రత దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. శుక్రవారం నాడు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. తీరప్రాంతాల్లో ఉన్న ప్రజలు, పల్లపు ప్రాంతాల నివాసితులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించింది.సముద్రం అల్లకల్లోలంగా మారిన నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని అధికారులు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే సమీప తీరాలకు చేరుకోవాలని ఆదేశించారు. తుపాను తీరం దాటే సమయంలో గాలి తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో, తీరప్రాంత జిల్లాల యంత్రాంగం ముందస్తు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు వెళ్లాయి. తుపాను కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

మంచి రోడ్లతోనే దేశాభివృద్ధి సాధ్యం

మొదటిపేజీ తరువాయి - అభివృద్ధి చేయడంపై మా దృష్టి ఉంది. గడ్కరీ జీ జాతీయ ప్రయోజనాలు, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాలు, ప్రజల సంక్షేమం వంటి అంశాల్లో రాజకీయాలు ఉండవని నేను గట్టిగా నమ్ముతున్నా. సమయం వచ్చినప్పుడు మనం ఎన్నికల్లో పోరాడుదాం. కానీ మిగిలిన సమయంలో, దేశ అభివృద్ధిపై దృష్టి పెడదాం. జాతీయ అభివృద్ధిలో తెలంగాణ తన వంతు పాత్ర పోషించేలా నేను చూస్తాను. ఇప్పుడు, నా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం కూడా మద్దతు ఇవ్వాలి.రోడ్ కనెక్టివిటీలో ప్రపంచంలోనే భారత్ నంబర్ వన్‌గా ఉండని నితిన్ గడ్కరీ చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటిస్తున్నట్లు తెలిపారు. రోడ్లు మంచిగా ఉంటే భారీగా పెట్టుబడులు వస్తాయని వివరించారు. అయితే పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత విషయంలో మనం ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. రోడ్లపై ఎలాంటి బ్లాక్ స్పాట్లు ఏర్పడకుండా ఉండేందుకు ప్రతి ఇంజినీర్ పూర్తి బాధ్యత తీసుకుని పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.'దేశంలో రోడ్డు ప్రమాదాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఈ మాటలు చెప్పడం కొంచెం ఇబ్బందిగా ఉన్నా.. చెప్పక తప్పని పరిస్థితి. ఏటా రోడ్డు ప్రమాదాల్లో లక్షల మంది చనిపోతున్నారు. వారిలో ఎక్కువ మంది యువకులే ఉంటున్నారు. ఈ రోడ్లపై ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి?. డీపీఆర్ల ఎలా తయారవుతున్నాయి? ఒక్క డీపీఆర్ కూడా సరిగ్గా తయారు కావడం లేదు. ఈ పదం వాడుతున్నందుకు క్షమించండి. ఇకపై రోడ్లపై బ్లాక్ స్పాట్స్ కనిపించకూడదు. బ్లాక్‌స్పాట్ ఉండకుండా చూడాల్సిన బాధ్యత ఇంజినీర్లదే'.ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగం పనులతు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపాలని గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-విజయవాడ ఎన్?హెచ్?-65ను ఆరు లైన్లుగా విస్తరించాలని కోరారు. హెచ్?ఐసీసీలో జరుగుతున్న ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్' సదస్సు ఈనెల 22 వరకు కొనసాగుతుంది. దేశవ్యాప్తంగా రోడ్లు, జాతీయ రహదారుల రంగానికి చెందిన నిపుణులు సహా సుమారు 3,500 మంది పాల్గొన్నారు.

వచ్చే 20 ఏళ్ల పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'

మొదటిపేజీ తరువాయి - 'ఇండియా ఫస్ట్' అనేదే ప్రాతిపదికగా ఉండాలని పారిశ్రామిక రంగానికి సూచించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పెట్టుబడులు గణనీయంగా పెంచాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధికి ఇంకా ఎలాంటి సంస్కరణలు అవసరమో ఎలాంటి సంకోచం లేకుండా తనకు నేరుగా తెలియజేయాలని పరిశ్రమల ప్రతినిధులను కోరారు.దిల్లీలో జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశం, వార్షిక సదస్సులో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. భారత్ 2047 లక్ష్యంగా దేశ ఆర్థికాభివృద్ధి, పరిశ్రమల వృద్ధి, అంతర్జాతీయ పోటీలో భారత స్థానం వంటి అంశాలపై మాట్లాడారు. పరిశ్రమలు, రైతులు, చిన్న వ్యాపారులు, సంపద సృష్టికర్తలు, పన్నులు చెల్లించే వారిని గౌరవించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. దేశీ వస్తువుల వినియోగం, స్వయం సమృద్ధి గురించి మహాత్మాగాంధీ 1930లో ఇచ్చిన సందేశాన్ని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేశారు.దాదాపు వందేళ్లు గడిచినా దేశం ఇంకా అదే సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. పారిశ్రామిక రంగం స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వందేళ్ల క్రితమే గాంధీజీ స్వదేశీ, స్వయం సమృద్ధి గురించి చెప్పారని, ఇప్పటికీ తాను అదే విషయాన్ని చెప్పాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. పరిశ్రమలు ఈ దిశగా మరింత వేగంగా అడుగులు వేయాలని కోరారు. దేశీయంగా తయారయ్యే వస్తువుల నాణ్యతను పెంచి, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు.గత ప్రభుత్వాల సమయంలో పరిశ్రమలకు ఎదురైన అనుభవాలు చేదుగా ఉండేవని మోదీ వ్యాఖ్యానించారు. ఆ ప్రభావం ఇప్పటికీ పరిశ్రమలకు, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య సంబంధాలపై కనిపిస్తోందని అన్నారు. అయితే ఇది పాత ప్రభుత్వం కాదని, పరిశ్రమలను మిత్రులుగా భావించే ప్రభుత్వమని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి అవసరమైన మార్పులు, సంస్కరణలపై పరిశ్రమల ప్రతినిధులు బహిరంగంగా తమ అభిప్రాయాలు చెప్పాలని కోరారు. ఎలాంటి భయం, సంకోచం లేకుండా తనకు నేరుగా లేఖలు రాయాలని సూచించారు. పరిశ్రమల సూచనలను ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.వ్యవసాయ రంగంలో పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉందని ప్రధాని స్పష్టం చేశారు. విదేశీ మార్కెట్లలో ఏయే భారతీయ ఉత్పత్తులకు డిమాండ్ ఉందో గుర్తించి, అందుకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయాలని పరిశ్రమలకు సూచించారు. ఆయా దేశాల అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచి పంటలను సేకరించే పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అన్నారు. దీనివల్ల రైతులకు మేలు జరగడంతోపాటు భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లో గుర్తింపు లభిస్తుందని వివరించారు.మరోవైపు, ఔషధ తయారీ రంగంలోనూ భారత్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ప్రపంచానికి మందులు అందించే దేశంగా భారత్‌కు గుర్తింపు ఉన్నప్పటికీ, ఔషధాల తయారీలో ఉపయోగించే కీలక ముడి పదార్థాలు, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్, బల్క్ డ్రగ్స్, ఇతర ఔషధ మధ్యవర్తి పదార్థాలను భారీగా దిగుమతి చేసుకుంటున్నామని గుర్తుచేశారు. వీటిలో ఏయే పదార్థాలను దేశీయంగా తయారు చేయవచ్చో పరిశ్రమలు గుర్తించాలని అన్నారు. కొత్త సాంకేతికత, భారీ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుపై పెట్టుబడులు పెట్టాలని సూచించారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గితే ఔషధ రంగంలో భారత్ మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు.భారత్ పలు ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని గుర్తుచేశారు. వీటి ద్వారా భారత పరిశ్రమలకు కొత్త మార్కెట్లలో అవకాశాలు లభిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలకు అనుగుణంగా పరిశ్రమలు కూడా ముందడుగు వేస్తే భారత్ స్వయం సమృద్ధి లక్ష్యాన్ని వేగంగా చేరుకోగలదని మోదీ ఆకాంక్షించారు. 'భారత్ 2047' ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సుకు పరిశ్రమల ప్రముఖులు, సంస్థల అధిపతులు, రాయబారులు, దౌత్యవేత్తలు, విధాన నిర్ణేతలు సహా 2,500 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. 1927లో ఏర్పాటైన ఫిక్కీ 2027 ఏప్రిల్ 7తో వందేళ్లు పూర్తి చేసుకోనుంది.

తిరుమలకు కూడా ఎల్‌నినో ఎఫెక్ట్.. అప్రమత్తమైన టీటీడీ

మొదటిపేజీ తరువాయి - యాజమాన్య చర్యలు ప్రారంభించింది. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు సుమారు 120 రోజుల అవసరాలకు సరిపోతాయని అధికారులు స్పష్టం చేశారు.తిరుమలలో భక్తుల రద్దీని బట్టి రోజుకు దాదాపు 50 నుంచి 60 లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. ఇందులో సగం నీటిని పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాల నుంచి తీసుకుంటున్నారు. మిగిలిన సగం తిరుపతి సమీపంలోని కల్యాణి డ్యామ్ నుంచి సరఫరా చేస్తున్నారు. గతంలో కురిసిన వర్షాలతో కొంత ఊరట లభించినప్పటికీ, భవిష్యత్ అవసరాల దృష్ట్యా టీటీడీ పొదుపు చర్యలు చేపట్టింది.ఇందులో భాగంగా ప్రైవేటు హోటళ్లు, మఠాలు, వాణిజ్య సముదాయాలకు ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. అవసరమైతే ప్రైవేటు హోటళ్లు తిరుపతి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని సమకూర్చుకునేలా ప్రణాళికలు రచిస్తున్నారు.రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాలు నిండితే 18 నెలల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు. ఒకవేళ వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోతే, కల్యాణి డ్యామ్‌తో పాటు ఇతర ప్రత్యామ్నాయ వనరుల నుంచి నీటిని తీసుకురావాలని నిర్ణయించారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. జలాశయాల్లో పూడికతీత, చెక్‌డ్యామ

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 20 - 11 - 2026

మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



అనంతపురం నవంబర్ 19 తెలుగుకలం : రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం (నవంబర్ 19న) మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దశలో భాగంగా అనంతపురము జిల్లాలోని 9 మండలాల పరిధిలో ఉన్న 172 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు జరగనున్నాయని, ఇందుకోసం మొత్తం 1,784 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు కొనసాగుతుందని, డిసెంబర్ 2వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు డీపీఓ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే స్టేజ్-1 మరియు స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులను నియమించామని చెప్పారు. జిల్లాలో ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందని, ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు అభ్యర్థులు, ఓటర్లు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి
జీవితం నేటి మహిళలకు స్ఫూర్తిదాయకం

స్త్రీ శక్తి దివస్ సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో సెమినార్



గుంతకల్లు, నవంబర్ 19 తెలుగు కలం: భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో వీరత్వానికి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం నేటి మహిళలకు ఆదర్శప్రాయమని ఏబీవీపీ అనంతపురం జిల్లా కన్వీనర్ కేఎస్ఆర్ శివరాజ్ అన్నారు. నవంబర్ 19న ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా నిర్వహించే స్త్రీ శక్తి దివస్‌ను పురస్కరించుకుని గుంతకల్లు పట్టణంలోని రక్షందా జూనియర్ కళాశాలలో ఏబీవీపీ గుంతకల్లు శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్ఆర్ శివరాజ్ మాట్లాడుతూ.. 1857లో జరిగిన తొలి స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడి తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి అని కొనియాడారు. చిన్న వయసులోనే అపారమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి శత్రువులకు ఎదురొడ్డి నిలిచిన ఆమె పోరాట పటిమ భారతీయుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన ఆమె త్యాగం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా ముందుకు సాగాలని, లక్ష్యాన్ని సాధించేందుకు ఆత్మవిశ్వాసంతో కృషి చేయాలని సూచించారు. ఝాన్సీ లక్ష్మీబాయి చూపిన తెగువ, దేశభక్తి, పోరాట స్ఫూర్తిని నేటి యువతులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు వీరేష్ కుమార్, చంద్రశేఖర్‌తో పాటు ఏబీవీపీ కార్యకర్తలు సాయి, వరుణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటి ఆంజనేయ స్వామికి విశేష పూజలు

పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా తిరుమంజనం, మన్యుసూక్త హోమం





కసాపురం, (తెలుగు కలం) (నవంబర్ 19) : గుంతకల్ నియోజకవర్గం కసాపురం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో గురువారం పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తికి తిరుమంజన సేవ నిర్వహించి, అనంతరం మన్యుసూక్త హోమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ప్రధాన అర్చకులు శ్రీ కే. రాఘవాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు వేద మంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి అనుగ్రహం భక్తులందరిపై ఉండాలని,ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక హోమం నిర్వహించారు.పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్లను
ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



కొత్తచెరువు నవంబర్ 19 తెలుగుకలం : కొత్తచెర్వులోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల పోస్టర్లను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ విద్యావిధానం యొక్క ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులకు ఆయన సూచించారు. చదువు మధ్యలో మానేసిన డ్రాప్-అవుట్ విద్యార్థులతో పాటు వివిధ కారణాల వల్ల చదువును కొనసాగించలేకపోయిన అర్హులైన వారందరికీ ఓపెన్ స్కూల్ విధానంపై సరైన అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ఈ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్‌లో తప్పిన విద్యార్థులతో పాటు అంగన్వాడి వర్కర్లు, హోంగార్డ్స్, ఆశా వర్కర్లు, మహిళా సంఘ సభ్యులు మరియు చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, మెప్మా, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖ, డ్వాక్రా, డ్వామా వంటి వివిధ శాఖలలో పనిచేస్తూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు కాని వారు ఓపెన్ స్కూల్ విద్యావిధానం ద్వారా తమ విద్యార్హతలను పూర్తి చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ లాజరు, ఓపెన్ స్కూల్ స్టేట్ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్‌లతో పాటు విద్యాశాఖ అధికారులు మరియు ఇతర సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా
ఎదగాలి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్





కొత్తచెరువు నవంబర్ 19 తెలుగుకలం: నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు చిన్ననాటి నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం కొత్తచెర్వులోని జెడ్పిహెచ్ బాలుర పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (ఎన్సిఎస్సి) జిల్లా స్థాయి ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా తమ చుట్టూ ఉన్న స్థానిక పర్యావరణ పరిస్థితులను నిశితంగా గమనించాలని సూచించారు. ప్రకృతికి హాని కలిగించని పర్యావరణహితమైన వస్తువులను తయారు చేయడంపై దృష్టి సారించాలని, తద్వారా శ్రీ సత్యసాయి జిల్లాను ఒక ఆదర్శవంతమైన, కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను ఆయన పరిశీలించి, వారి సృజనాత్మకతను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుండి మొత్తం 70 బృందాలుగా విద్యార్థులు తాము రూపొందించిన వినూత్న పరిశోధనా ప్రాజెక్టులతో ఈ ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నట్లు కార్యక్రమ సమన్వయకర్త జగదీష్, అకాడమిక్ సమన్వయకర్త శ్రీనివాసరావు తెలిపారు. ప్రదర్శించిన ప్రాజెక్టులలో ప్రతిభ కనబరిచిన 7 ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జ్యూరీ సభ్యులుగా మంజుల, మహేంద్ర రెడ్డి, జయశంకర్, ముబారక్, మనోహర్, ప్రవీణ్, సురేష్ వ్యవహరించారని జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ పేర్కొన్నారు. ఈ ముగింపు సమావేశంలో డిఇఓ క్రిస్టప్ప, ప్రధానోపాధ్యాయులు గోపాల్, వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారి జయచంద్ర, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అనంతపురంలో ఘనంగా 'మ్యూజియం చూద్దాం రండి' హెరిటేజ్ వాక్

అనంతపురం నవంబర్ 19 తెలుగుకలం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ ఆధ్వర్యంలో 'ప్రపంచ వారసత్వ వారోత్సవాలు -- 2026' వేడుకలు గురువారం అనంతపురంలో అత్యంత ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ కమిషనర్ శ్రీ ముత్యాలరాజు రేవు ఐఏఎస్ మరియు అనంతపురం జిల్లా కలెక్టర్ శ్రీ ఓ. ఆనంద్ ఐఏఎస్ గారి నేతృత్వంలో "మ్యూజియం చూద్దాం రండి" పేరిట భారీ హెరిటేజ్ వాక్ (ర్యాలీ) నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఎస్.ఎస్.బి.ఎన్ కళాశాల వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీని అనంతపురం జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ సూయశ్ కుమార్ ఐఏఎస్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ నగర పురవీధుల గుండా సాగి పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ వద్దకు చేరుకుంది. ఆదిమ మానవుల కాలం నాటి నుండి 19వ శతాబ్దం వరకు గల అనంతపురం జిల్లా చరిత్రను, సంస్కృతిని నేటి తరానికి పరిచయం చేయడంతో పాటు, వారసత్వ సంపదను భావితరాలకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ సూయశ్ కుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ, నిత్యజీవితంలో నైతిక విలువలతో కూడిన ఉన్నత జీవన విధానాన్ని కొనసాగించాలంటే ప్రతి ఒక్కరూ మన వారసత్వ విలువలను అనుసరించాలని సూచించారు. మన చారిత్రక కట్టడాలను భావితరాల కోసం పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ సహాయ సంచాలకులు శ్రీ ఎం. స్వామి నాయక్ మాట్లాడుతూ,



అనంతపురం జిల్లా యొక్క ఘనమైన చరిత్రకు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మ్యూజియం నిలువుటద్దమని, మ్యూజియాన్ని సందర్శించడం ద్వారా మన పూర్వీకుల సంస్కృతి, చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ కో-కన్వీనర్ శ్రీ వి. కృష్ణమూర్తి మాట్లాడుతూ, అనంతపురం ఘనమైన వారసత్వ చరిత్రకు నిలయమని, దీనిని కాపాడుకోవాల్సిన ప్రధాన బాధ్యత యువతపై ఉందని పిలుపునిచ్చారు. మరో సభ్యులు శ్రీ కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, శ్రీకృష్ణదేవరాయల కాలానికి ముందు మరియు ఆ తర్వాత వెలసిన అనేక చారిత్రక కట్టడాలను పరిరక్షించడంలో యువత ముందుండాలని కోరారు. ఇంటెక్ సభ్యులు, ప్రముఖ రచయిత శ్రీ మురళీకృష్ణ వారసత్వ పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించగా, తెలుగు సాహితీ ప్రముఖులు శ్రీ జాగర్లమూడి శ్యామసుందర శాస్త్రి మాట్లాడుతూ నేటి తరానికి, భావితరాలకు వారసత్వాన్ని అందించడంలో యువకులు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎస్.ఎస్.బి.ఎన్



కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి సరిత, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీమతి భార్గవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ తెలుగు అధ్యాపకులు శ్రీ నగరూరు రసూల్ అనంతపురం చారిత్రక వైభవాన్ని చాటిచెప్పే కవితా సందేశాన్ని వినిపించారు. అలాగే శ్రీ షేక్ రియాజుద్దీన్ తెలుగు పద్యాలను ఆలపించి విద్యార్థులను అలరించారు. ఇన్నర్ వీల్ సభ్యులు శ్రీమతి జయంతి, శ్రీమతి శ్రీవల్లి మాట్లాడుతూ, వారసత్వ పరిరక్షణలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, తల్లులు తమ పిల్లలకు పాఠశాల చదువులతో పాటు కుటుంబంలోనే వారసత్వ మరియు నైతిక విలువలను బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటెక్ సభ్యులు జూటూరి షరీఫ్, సూర్యనారాయణ రెడ్డి, సూర్య ప్రకాష్ రెడ్డి, సాధు శేఖర్ తదితరులు పాల్గొన్నారు. చివరగా విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన జానపద గేయాలు, తెలుగు పద్యాలు మరియు సాంస్కృతిక ప్రదర్శనలు అనంతపురం యొక్క చారిత్రక వైభవాన్ని స్ఫూర్తిదాయకంగా గుర్తుచేశాయి.

ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు

అనంతపురం నవంబర్ 19 తెలుగుకలం : అనంతపురం జిల్లా యువజన సర్వీసుల శాఖ/సెట్విన్ (ఆన్ సెట్) మరియు ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో జిల్లా స్థాయి యువజనోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో కళలు, సాహిత్యం, సాంస్కృతిక రంగాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు వారిలోని సృజనాత్మక ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన నాటకం, నృత్యం, చిత్రలేఖనం, కవిత్వ పఠనం తదితర విభాగాల్లో జిల్లావ్యాప్తంగా పలు విద్యాసంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. నాటక ప్రదర్శనల ద్వారా సామాజిక అంశాలను, తమ ఆలోచనలను ఆకట్టుకునే రీతిలో ప్రదర్శించగా, నృత్య ప్రదర్శనలతో కళాత్మక నైపుణ్యాన్ని కనబరిచారు. చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు తమ ఊహాశక్తికి రంగులద్దుతూ చక్కటి చిత్రాలను ఆవిష్కరించారు. కవిత్వ పఠనంలో భాషా పటిమ, భావవ్యక్తీకరణతో అందరినీ మెప్పించారు. పాఠ్యాంశాల అధ్యయనంతో పాటు ఇలాంటి సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన పెంపొందుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతులు సాధించిన విజేతలను నిర్వాహకులు అభినందించారు. జానపద నృత్యం విభాగంలో కేఎస్ఎన్ ప్రభుత్వ





డిగ్రీ కళాశాల బృందం, జానపద పాట విభాగంలో ఏరా ఇంటర్నేషనల్ స్కూల్ బృందం, వీధి నాటకం విభాగంలో రిప్పర్ కళాశాల బృందం ప్రథమ స్థానాల్లో నిలిచాయి. అలాగే పెయింటింగ్ విభాగంలో జూనియర్ కళాశాల విద్యార్థి నితిన్, కవిత్వం విభాగంలో



లా కళాశాల విద్యార్థిని లక్ష్మి ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ/ఆన్ సెట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రవిశంకర్ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్‌పర్సన్ గీతా బాల, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ కేశవ్, జేవీన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ రాధా కళ్యాణి, ఆన్ సెట్ మేనేజర్ చిగిచెర్ల శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ ఏవో బాలాజీ నాయక్, ఎస్సార్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర రమేష్, రాయల్ యూత్ సొసైటీ అధ్యక్షుడు రాయల్ రంగా, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాతి జీవన్ కుమార్, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఏఐటీయూసీ 43వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి: అనంతపురంలో బైక్ ర్యాలీ

అనంతపురం నవంబర్ 19 తెలుగుకలం : నవంబర్ 22 నుండి 26వ తేదీ వరకు బెంగళూరు నగరంలో జరగనున్న అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) 43వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం అనంతపురం నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో నగరంలోని క్లాక్ టవర్ సర్కిల్ నుండి సీపీఐ కార్యాలయం వరకు సాగిన ఈ ర్యాలీలో కార్మికులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్. రాజేష్ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, వందేళ్ల పాటు ఏఐటీయూసీ పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కార్పొరేట్లకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల పొట్టగొడుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశ ప్రజల ఆస్తులను తెగనమ్మడం సరైనది



కాదని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని పార్లమెంటరీ కమిటీలు సిఫార్సు చేస్తున్నప్పటికీ, దేశంలో అవి అమలుకు నోచుకోవడం లేదని రాజేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వ పీఆర్సీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీ కమిటీ నివేదికలను తక్షణమే తెప్పించుకుని వేతనాలను పెంచాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న బకాయి డీఏలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం వంటి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అసంఘటిత రంగంలో అధిక సంఖ్యలో ఉన్న ఆటో, హమాలీ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ వర్గాలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలన్నింటిపై నవంబర్ 22 నుండి 26 వరకు బెంగళూరులో జరగనున్న 43వ జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్ పోరాట కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. నవంబర్ 22న బెంగళూరులో నిర్వహించనున్న బహిరంగ సభకు కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు జి. చిరంజీవి, జిల్లా నాయకులు కృష్ణానాయక్, వెంకటేష్, శివకృష్ణ, ప్రవీణ్, వేణు, ధనుంజయ, రాము, షరీఫ్, షేక్షావలి, నాయక్, నాయుడు, వెంకట్ రాముడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ముందు టీడీపీ కార్యకర్తల ఆందోళన

సింగనమల ఎంపీపీ అభ్యర్థి మార్పుపై తీవ్ర అసమ్మతి

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 19) : ప్రతినిధి : సింగనమల మండల ఎంపీపీ అభ్యర్థి మార్పు వ్యవహారం తెలుగుదేశం పార్టీలో తీవ్ర అసమ్మతికి, ఆందోళనలకు దారితీసింది. మొదటి నుంచి ఎంపీపీ అభ్యర్థిగా ఖరారు చేసిన పేట తులసిని చివరి నిమిషంలో పక్కనపెట్టి, నిధనవాడ ఎంపీటీసీ గొల్ల హరితకు అవకాశం కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం రేపుతోంది. పార్టీ కోసం కష్టపడిన వారికి అన్యాయం చేస్తున్నారంటూ టీడీపీ కార్యకర్తలు గురువారం అనంతపురంలోని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ నివాసం, కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఈ క్రమంలో కార్యకర్తలు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకుని పేట తులసికే ఎంపీపీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ కోసం శ్రమించిన క్యాడర్‌కు గుర్తింపు ఇవ్వకపోతే రాజీనామాలకు కూడా వెనుకాడబోమని వారు హెచ్చరించారు. ఎంపీపీ ఎన్నికల ప్రారంభంలో పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రాని పరిస్థితుల్లో సీనియర్ నాయకుడు, న్యాయవాది ఈశ్వర్‌రెడ్డి కోడలు పేట తులసిని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



అయితే ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ, వైసీపీలకు సమాన సంఖ్యలో స్థానాలు రావడంతో ఎంపీపీ పదవిపై ఉత్కంఠ నెలకొంది. చివరకు టాస్ ద్వారా ఎంపిక జరిగే పరిస్థితి ఏర్పడటంతో చివరి నిమిషంలో అభ్యర్థిని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం వివాదానికి కారణమైంది. పేట తులసి గెలుపు కోసం ఈశ్వర్‌రెడ్డి వర్గం సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు చేసిందని, మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన తమను కాదని మరో అభ్యర్థికి అవకాశం కల్పించడం సరికాదని ఆయన అనుచరులు ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో పాటు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుపై కూడా కార్యకర్తలు తీవ్ర ఆరోపణలు చేశారు. వైసీపీ నాయకులతో అంతర్గత అవగాహనతోనే అభ్యర్థి మార్పు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వైసీపీ నేతల నుంచి డబ్బులు తీసుకుని నిర్ణయాలు మార్చారంటూ వారు విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ మధ్య రాజకీయ అవగాహన ఉందన్న అనుమానాలను కార్యకర్తలు వ్యక్తం చేస్తూ, వీరి ఫోన్‌కాల్ వివరాలపై పార్టీ అధిష్ఠానం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొనలేదని, అభ్యర్థులకు తగిన సహకారం అందించలేదని, ఏడీసీసీ చైర్మన్ కేశవరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు ధర్మవరం సుబ్బారెడ్డి సూచనలను కూడా పట్టించుకోలేదని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత నాయకుల స్పందన తెలియాల్సి ఉండగా, టీడీపీ రాష్ట్ర అధిష్ఠానం వెంటనే జోక్యం చేసుకుని ఎంపీపీ అభ్యర్థి ఎంపిక వివాదంపై సమగ్ర విచారణ జరిపించాలని సింగనమల పార్టీ శ్రేణులు కోరుతున్నాయి.

తాడిమర్రి ఎంపీపీ, వైస్ ఎంపీపీ పీఠాలను

కైవసం చేసుకున్న కూచి నాగవేణి, పద్మావతి

తాడిమర్రి (తెలుగు కలం) (నవంబర్ 19) : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రి మండల పరిషత్ ఎన్నికల్లో ఊహించని రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కూటమి పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించిన తాడిమర్రి ఎంపీపీ స్థానాన్ని టీడీపీ రెబల్ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. తాడిమర్రి ఎంపీపీగా కూచి నాగవేణి, వైస్ ఎంపీపీగా పద్మావతి ఘనవిజయం సాధించారు. ?తాడిమర్రి మండలంలోని మొత్తం 9 ఎంపీటీసీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 5 స్థానాలు, వైసీపీ 3 స్థానాలు, బీజేపీ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. అయితే, కూటమి ఒప్పందంలో భాగంగా ఎంపీపీ స్థానాన్ని బీజేపీకి కేటాయించడంతో స్థానిక టీడీపీ ఎంపీటీసీ సభ్యులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యధికంగా 5 ఎంపీటీసీ స్థానాలు గెలుచుకున్న తమకే ఎంపీపీ పదవి దక్కాలని టీడీపీ శ్రేణులు మొదటి నుంచీ పట్టుబడుతూ వచ్చాయి. మరోవైపు, తమ పార్టీ తరపున గెలుపొందిన ఎంపీటీసీ సభ్యురాలు

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 20 - 11 - 2026

మూడు దశాబ్దాల తర్వాత రాయదుర్గంలో పసుపు జెండా రెపరెపలు

ఐదు మండల ప్రజా పరిషత్తులపై టీడీపీ విజయకేతనం..

నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీల ప్రమాణ స్వీకారం

గ్రామీణాభివృద్ధికి ఇది కీలక మలుపు: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు





రాయదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 19) : రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండల ప్రజా పరిషత్తులను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడంతో నూతన కార్యవర్గాలు గురువారం కొలువుదీరాయి. ఐదు మండలాల టీడీపీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ అభ్యర్థులు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్ మండలాల్లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాయదుర్గం ఎంపీపీగా లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీగా కురుబ హనుమంతు, కణేకల్ ఎంపీపీగా మోడ హేమావతి, వైస్ ఎంపీపీగా తిప్పమ్మ, బొమ్మనహాళ్ ఎంపీపీగా సోమనాథ్, వైస్ ఎంపీపీగా ప్రవళిక, డి.హీరేహాళ్ ఎంపీపీగా పాటిల్ శైలజ, వైస్ ఎంపీపీగా సంతోష కుమారి, గుమ్మగట్ట ఎంపీపీగా కాలువ సన్నన్న, వైస్ ఎంపీపీగా సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, కణేకల్ మండలాల్లో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై నూతన ప్రజాప్రతినిధులను అభినందించారు.డి.హీరేహాళ్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 1996లో రాయదుర్గం రూరల్ మండల ప్రజా పరిషత్‌ను టీడీపీ కైవసం చేసుకుందని, మళ్లీ 30 ఏళ్ల తర్వాత నియోజకవర్గంలోని ఐదు మండల ప్రజా పరిషత్తులపై విజయకేతనం ఎగురవేయడం చారిత్రాత్మకమన్నారు. ఐదు ఎంపీపీ స్థానాలతో పాటు కూటమి పోటీ చేసిన ఐదు జెడ్పీటీసీ స్థానాల్లోనూ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా డి.హీరేహాళ్‌లో కూటమి తరఫున బీజేపీ అభ్యర్థి వన్నూరుస్వామి గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంపై నియోజకవర్గ ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఏకపక్ష తీర్పునిచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తామని స్పష్టం చేశారు. నూతన ఎంపీపీలు, రాబోయే సర్పంచులు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు తాను ఎల్లప్పుడూ చేదోడువాదోడుగా ఉండి, గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఇంతటి ఘన విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పరిశీలకులు గుర్రప్ప, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తలారి గంగాధర, కురుబ మల్లెన్న, వన్నారెడ్డి, జెడ్పీటీసీలు ఆదినారాయణ, వన్నూరుస్వామి, కొత్తపల్లి మల్లికార్జున, తిమ్మరాజులు, ముల్లంగి నారాయణ స్వామి, చంద్రహాస్, నాగల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



నాటుబాంబు పేలి ఎనుము మృతి.. రైతుకు రూ.70 వేల నష్టం

కుందుర్పి (తెలుగు కలం) (నవంబర్ 19) : ప్రతినిధి : అడవి పందుల వేట కోసం వేటగాళ్లు అమర్చిన నాటుబాంబు పేలి ఓ ఎనుము మృతి చెందిన ఘటన కుందుర్పి మండలంలోని కరిగానిపల్లి సమీప అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు జంబు పరమేశప్ప రోజువారీలాగే తన ఎనుమును మేత కోసం సమీప అటవీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో అక్కడ గుర్తుతెలియని వ్యక్తులు అమర్చిన నాటుబాంబును ఎనుము నోటితో తాకడంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎనుము కొద్దిసేపటికే ప్రాణాలు విడిచింది. ఈ ఘటన వల్ల తనకు సుమారు రూ.70 వేల వరకు ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు.



వేటగాళ్ల ఆగడాలతో తరచూ ప్రమాదాలు..

కర్ణాటకలోని చెళ్లకెర, కళ్యాణదుర్గం ప్రాంతాలకు చెందిన కొందరు వేటగాళ్లు ఎనుములదొడ్డి అటవీ ప్రాంత పరిసరాల్లో అడవి పందులను వేటాడేందుకు తరచూ నాటుబాంబులు అమర్చుతున్నారని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ కంచంపల్లికి చెందిన పాపన్న అనే రైతు తన పొలంలో పడి ఉన్న నాటుబాంబును తెలియక చేత్తో పట్టుకోవడంతో అది పేలి కంటి చూపు కోల్పోయిన ఘటనను వారు గుర్తుచేస్తున్నారు. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటం వల్లే వేటగాళ్ల ఆగడాలు మితిమీరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అటవీ ప్రాంతాల్లో నిఘా పెంచాలని, నాటుబాంబులు అమర్చుతున్న వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నీటి తూములో మృతదేహం.. ఆరు గ్రామాలకు నిలిచిన సాగునీరు



వజ్రకరూరు : (తెలుగు కలం) (నవంబర్ 19) : జిల్లా వజ్రకరూరు మండల పరిధిలోని ఛాయాపురం సమీపంలో గల హంద్రీనీవా ఎస్కేప్ ఛానల్ వద్ద ఒక గుర్తుతెలియని పురుషుడి మృతదేహం కలకలం రేపింది. ఎస్కేప్ ఛానల్ వద్ద నూతనంగా నిర్మించిన నీటి తూములో ఈ మృతదేహం అడ్డంగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. తూములో మృతదేహం చిక్కుకుపోవడంతో కాలువలో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీనివల్ల దిగువ ప్రాంతాలకు నీరు సరఫరా కాక సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఛాయాపురం, పెంచలపాడు, ఖాజీపురం, గడేకల్లు, గుమ్మనూరు, బెనపాడు గ్రామాల పరిధిలోని పంట పొలాలకు సాగునీరు నిలిచిపోయింది. ప్రస్తుతం పంటలకు నీరు అత్యవసరమైన తరుణంలో ప్రవాహం ఆగిపోవడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరు గ్రామాల రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. తూములో అడ్డంగా పడి ఉన్న మృతదేహాన్ని తక్షణమే తొలగించి, పంట పొలాలకు సాగునీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

అగాపే ఆశ్రమంలో కట్టెల వితరణ, అన్నదానం



యాడికి నవంబర్ 19 (తెలుగు కలం): యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలోని అగాపే ఆశ్రమంలో కట్టెల డిపో నిర్వాహకుడు బషీర్ వంట సరుకుతో పాటు నాలుగు ట్రాక్టర్ల కట్టెలను వితరణతో పాటు భోజనాలు ఏర్పాటు చేసి అన్నదానం చేశారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ గురువారం తెలిపారు.ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు బత్తుల ప్రసాద్, ఆశ్రమవాసులు బషీర్, ఆయన కుటుంబానికి కృతజ్ఞతలు తెలుపుతూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

నామినేషన్ పత్రాల చించివేత.. సచివాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత



నార్పల (తెలుగు కలం) (నవంబర్ 19) : ప్రతినిధి : అనంతపురం జిల్లా నార్పల మండలం బి. పప్పూరు గ్రామ సచివాలయంలోని నామినేషన్ కేంద్రం వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బొందలవాడ గ్రామ సర్పంచ్ పదవికి సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతున్న సమయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల వర్గీయుల మధ్య తలెత్తిన వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు తమ మద్దతుదారులతో కలిసి నామినేషన్ పత్రాలను సమర్పించేందుకు బి. పప్పూరు నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, వారు నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్న క్రమంలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ)కి చెందిన కొందరు వ్యక్తులు అక్కడికి వచ్చి అభ్యర్థుల చేతుల్లోని నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కొని చించివేశారంటూ వైసీపీ వర్గీయులు ఆరోపించారు. ?ఈ అనూహ్య పరిణామంతో గ్రామ సచివాలయ ఆవరణలో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడి, ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రజాస్వామ్యబద్ధంగా నామినేషన్ వేయకుండా అడ్డుకోవడమే కాకుండా పత్రాలను చించివేయడం దారుణమని వైసీపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి, దౌర్జన్యానికి పాల్పడిన వారిపై అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సచివాలయం వద్ద పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు బందోబస్తు ఏర్పాటు చేసి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు

గుంతకల్లులో ఉచిత వైద్య శిబిరం

250 మందికి పైగా పరీక్షలు, మందుల పంపిణీ



గుంతకల్లు(తెలుగు కలం) (నవంబర్ 19) : ప్రతినిధి : స్థానిక మోదీనాబాద్ ఏరియాలో గురువారం ఉచిత హెల్త్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ అరుణ మాట్లాడుతూ, ఈ ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పైగా స్థానికులకు రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), జ్వరాలతో పాటు పలు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశామని, ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ?ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ జీవిత, ఎంఎస్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, తెలుగుదేశం పార్టీ నేతలు చికెన్ జగన్, ఏఎన్ఎంలు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

ఫినో బ్యాంక్ ఖాతాలకు బదులుగా జాతీయ బ్యాంకులకు

ఎన్పీసీఐ లింకింగ్ మార్చుకోవాలి



యాడికి నవంబర్ 19 (తెలుగు కలం): యాడికి మండల వ్యాప్తంగా ఉన్న రైతులు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల నగదు జమ విషయంలో అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా గురువారం సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది రైతుల ఆధార్ ఆధారిత చెల్లింపులు ఫినో పేమెంట్స్ బ్యాంక్ ఖాతాలకు జమ అవుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.మండలంలో మొత్తం 81 మంది రైతుల ఖాతాలు ఫినో బ్యాంకుకు లింక్ అయి ఉన్నట్లు గుర్తించి, రైతు సేవా కేంద్రాల వారీగా వివరాలు సేకరించామని పేర్కొన్నారు. సంబంధిత ఆర్ఎస్‌కే సిబ్బంది ద్వారా రైతులకు సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు.రైతులు తమ సంక్షేమ పథకాల నగదు సురక్షితంగా పొందేందుకు ఫినో బ్యాంక్ ఖాతాలకు ఉన్న ఆధార్, ఎన్పీసీఐ లింకింగ్‌ను సమీప జాతీయ బ్యాంకు ఖాతాలకు మార్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఇంటిపేరు వల్లే విమర్శలు.. పరుగులతో

గౌరవం సంపాదించాడు తనయుడు ఆర్యవీర్‌పై సెహ్వాగ్

భారత్ అండర్-19 ఆసియా కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆర్యవీర్ సెహ్వాగ్

టోర్నీలో 361 పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా నిలిచిన యువ ఓపెనర్

భారీ పరుగులు చేస్తేనే గౌరవం దక్కుతుందని కొడుకుకు చెప్పానన్న మాజీ డాషింగ్ ఓపెనర్



ప్రముఖుల సంతానం అనే కారణంతో ఎదురయ్యే విమర్శలను ఎవరూ ఆపలేరని, అయితే మైదానంలో భారీ పరుగులు సాధించడం ద్వారానే తన కుమారుడు ఆర్యవీర్ క్రికెట్ ప్రపంచంలో తగిన గౌరవాన్ని సంపాదించుకున్నాడని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. ఇటీవల ఒమన్‌లో జరిగిన ఏసీసీ పురుషుల అండర్-19 ఆసియా కప్‌ను భారత్ కైవసం చేసుకోవడంలో ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ... తన కుమారుడి ప్రతిభపై హర్షం వ్యక్తం చేశాడు. “భారత్ ఆసియా అండర్-19 ట్రోఫీ సాధించడంలో,

ఆంగ్ల సాహిత్యంలో ఉప్పతోళ్ల రాజేష్‌కు

పీహెచ్‌డీ పట్టా.. కమ్మవారిపల్లిలో సంబరాలు



తిరుపతి/ఓడిసి(తెలుగు కలం) (నవంబర్ 19) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ఓబులదేవరచెరువు మండలం లోని మారుమూల గ్రామమైన కమ్మవారిపల్లికి చెందిన యువ పరిశోధకుడు ఉప్పతోళ్ల రాజేష్ ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ సాధించి తన గ్రామానికి, కుటుంబానికి, జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం **(SVU)** నుంచి **»»Aravind Adigaµs Novels: A Thematic Studyµµ** అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనా గ్రంథానికి పీహెచ్‌డీ పట్టా పొందేందుకు అర్హత సాధించారు. ప్రముఖ ఆచార్యులు ప్రొఫెసర్ కుసుమ హరినాథ్ మార్గదర్శకత్వంలో రాజేష్ ఈ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. పరిశోధనా గ్రంథాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన పరీక్షకుల మండలి సిఫార్సుల మేరకు విశ్వవిద్యాలయం 2026 నవంబర్ 12న అధికారికంగా ఈ ఫలితాన్ని ప్రకటించింది. మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి, అనేక ఆర్థిక, సామాజిక సవాళ్లను అధిగమిస్తూ ఉన్నత విద్యలో తన లక్ష్యాన్ని చేరుకోవడం ఆయన పట్టుదలకు, విద్య పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనంగా నిలిచింది. ఆంగ్ల సాహిత్య పరిశోధన రంగంలో తనదైన ముద్ర వేస్తూ ఆయన ఇప్పటివరకు నాలుగు పరిశోధనా వ్యాసాలను ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురించడంతో పాటు, పలు జాతీయ మరియు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని తన పరిశోధనా పత్రాలను సమర్పించారు. గ్రామీణ నేపథ్యం ఉన్నప్పటికీ సంకల్ప బలం ఉంటే పరిశోధన రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రాజేష్ తన విజయంతో నిరూపించారు. పట్టుదల, కఠోర శ్రమ ఉంటే మారుమూల గ్రామాల నుంచి కూడా అద్భుత విజయాలు సాధించవచ్చని రాజేష్ ప్రయాణం నేటి యువతకు ఎంతో స్ఫూర్తినిస్తోంది. ఆయన సాధించిన ఈ అరుదైన ఘనత పట్ల కమ్మవారిపల్లి గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి ఆదేశం



విశాఖపట్నం (తెలుగు కలం) (నవంబర్ 19) : ప్రతినిధి : జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూములను సత్వరమే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూసేకరణ, 22ఏ కేసులు, ఆన్‌లైన్ సేవలు, వినతుల పరిష్కారం మరియు మండలాల్లో నెలకొన్న ఇతర సమస్యలపై అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఏపీఐఐసీ, జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, జాతీయ రహదారులు తదితర సంస్థల ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల కోసం సేకరిస్తున్న భూముల విషయంలో సంబంధిత రైతులతో నేరుగా చర్చించాలని సూచించారు. వారికి అందాల్సిన పరిహారాన్ని త్వరితగతిన అందజేసి, భూసేకరణ ప్రక్రియను వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అలాగే, 22ఏ కింద ఆఫ్‌లైన్ మరియు ఆన్‌లైన్ విధానాల్లో అందిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ అర్జీలు మరియు ప్రగతి నివేదికలను ప్రతి వారాంతపు సమీక్షకు సిద్ధంగా ఉంచాలని డీఆర్‌వోకు సూచించారు. ఎటువంటి వినియోగం లేకుండా ఖాళీగా ఉన్న ఏలియనేషన్ భూములపై సమగ్ర నివేదిక పంపాలని, హౌసింగ్ కాలనీలలో కనీస మౌలిక వసతుల కల్పనతో పాటు ఆక్రమిత భూములను గుర్తించి వెంటనే నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డీఆర్‌వో ఎస్టీ అనిత, ఆర్డీవోలు సంగీత మాధుర్, దిలీప్ చక్రవర్తి, ప్రత్యేక ఉప కలెక్టర్లు, వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి దయానిధి మరియు తహశీల్దార్లు పాల్గొన్నారు.

గుమ్మగట్ట కేజీబీవీ సిబ్బందిపై వేటు..

ప్రిన్సిపల్, వంట మనుషుల తొలగింపు

అనంతపురం నవంబర్ 19 తెలుగుకలం: అనంతపురం జిల్లా గుమ్మగట్ట కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో ఇటీవల చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనకు సంబంధించి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేజీబీవీ ప్రిన్సిపల్, ప్రధాన వంట మనిషి (హెడ్ కుక్), అలాగే అసిస్టెంట్ కుక్‌లను విధుల నుంచి తొలగిస్తూ సమగ్ర శిక్ష అనంతపురం జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ) గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాఠశాలలో ఇటీవల రాత్రి భోజనం చేసిన అనంతరం పలువురు విద్యార్థినులు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో ఆహార పదార్థాల నాణ్యత, తయారీ, నిల్వ మరియు సిబ్బంది పనితీరుపై విద్యాశాఖ, ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించారు. బాధిత విద్యార్థినులకు వైద్యులు చికిత్స అందించగా, అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఘటనపై విచారణ మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల క్రమంలో ప్రిన్సిపల్‌తో పాటు ఇద్దరు వంట సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తూ ఏపీసీ అధికారిక ఉత్తర్వులు వెలువరించారు.

మైనర్ బాలికపై అత్యాచార యత్నం కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

యాడికి నవంబర్ 19 (తెలుగు కలం): యాడికి మండల పరిధిలోని రాయలచె రువు గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అత్యాచార యత్నం, బెదిరింపుల కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, విధించినట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచార యత్నం, బెదిరింపుల కేసులో నగిరి రమేష్ (39)కు పోక్సో కోర్టు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6 వేల జరిమానా బాధితురాలికి రూ.75 వేల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించిందన్నారు.పది మంది సాక్షుల విచారణ అనంతరం బుధవారం న్యాయమూర్తి చిన్నబాబు తీర్పు వెల్లడించారని ఆయన పేర్కొన్నారు.

ఎస్జేపీ పాఠశాలను తనిఖీ చేసిన

జిల్లా విద్యాశాఖ అధికారి అయూబ్ ఖాన్



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 19) : ప్రతినిధి : పట్టణంలోని శ్రీ జగద్గురు పండితారాధ్య (ఎస్జేపీ) ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి అయూబ్ ఖాన్ ఇవాళ తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, బోధనా తీరుతెన్నులను తెలుసుకునేందుకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. ముందుగా పాఠశాల కార్యాలయ గదిలోకి వెళ్లిన ఆయన, పాఠశాలకు సంబంధించిన ముఖ్యమైన రికార్డులను మరియు ఉపాధ్యాయుల హాజరు పట్టికను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది సమయపాలన, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన డీఈఓ, విద్యార్థులతో నేరుగా ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో ఆప్యాయంగా మాట్లాడి, బోధన సాగుతున్న తీరును అడిగి తెలుసుకోవడమే కాకుండా పాఠశాలలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థుల చదువుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గుంతకల్లు మండల విద్యాశాఖ అధికారి మస్తాన్ రావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

భోగాలగట్టలో ఫైలేరియా పరీక్షలకు ఆరు బృందాల ఏర్పాటు



యాడికి నవంబర్ 19 (తెలుగు కలం): యాడికి మండల పరిధిలోని రాయలచెరువు ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్‌ను గురువారం తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు పరిశీలించి రికార్డుల నిర్వ హణపై సిబ్బందికి సూచనలు చేశారు.అనంతరం గర్భిణులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన నెల 23న భోగాలగట్టలో ఫైలేరియా నైట్ బ్లడ్ కలెక్షన్ నిర్వహించేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ గంగాదేవి, ఫిమేల్ సూపర్వైజర్ ఉమాదేవి, ఎంపీహెచ్ఏ మైనుద్దీన్, ఏఎన్ఎంలు,ల్యాబ్ టెక్నీషియన్ సాయి లత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు..

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

శుక్రవారం 20 - 11 - 2026

దోమల నివారణకు డ్రోన్ అస్త్రం - ఫలితాలు సూపర్!

దోమల నివారణకు వరంగల్ జీడబ్ల్యూఎంసీ డ్రోన్ అస్త్రాన్ని ప్రయోగించింది

నగరంలో మూడు రోజుల పాటు విజయవంతంగా ట్రయల్ రన్‌ను చేపట్టింది



ప్రతి ఇంట్లో దోమల పోరు తప్పకుండా ఉంటుంది. సాయంత్రం అయ్యిందంటే చాలు దోమలు ఇంట్లోకి దండయాత్ర మొదలుపెడతాయి. వీటి బెడదను తట్టుకోలేక ప్రజలు ఆల్ అవుట్, దోమల తెర, దోమల బ్యాట్ వంటివి వాడుతుంటారు. ప్రతి ఏటా ఎంతోమంది డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడుతుంటారు. గ్రేటర్ వరంగల్‌లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా వర్షాకాలం, శీతాకాలం సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ దోమలకు చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఆ లక్ష్యంగా సరికొత్త కార్యాచరణతో సమగ్ర ప్రణాళికలు రూపొందించింది. వరంగల్, దాదాపు 400 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన నగరం, సుమారు 90 కిలోమీటర్ల మేర ఉన్న మురుగునీటి కాల్వలు, 270 వరకు మురికి వాడలు ఉండటంతో జనావాసాల పరిధిలో దోమల స్వైరవిహారం నడుస్తోంది. దీంతో ప్రజలకు నానా తిప్పలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ తరహాలో దోమల నివారణకు డ్రోన్ అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించింది. డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేసేలా ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నారు. దీనికోసం గ్రేటర్ హైదరాబాద్ నుంచి డ్రోన్ మిషన్‌ను తెప్పించి అధికారులు ట్రయల్ రన్‌ను చేపట్టారు.మొదట డ్రోన్‌కి అమర్చిన ప్రత్యేక యంత్రంలో జీడబ్ల్యూఎంసీ సిబ్బంది దోమల మందును నింపుతారు. ఆ తర్వాత రిమోట్ సాయంతో డ్రోన్‌ను కావాల్సిన ఎత్తులో నడుపుతూ ప్రధానంగా మురికి కాలువల మీదుగా పంపిస్తారు. ఆ సమయంలోనే డ్రోన్ దోమల మందును మురికి నీరుపై పిచికారి చేసేలా ఏర్పాట్లు చేశారు. అలాగే మురికి కాలువలకు ఆనుకుని ఉండే ఇళ్ల వద్ద కూడా పిచికారీ చేయించారు.ప్రధానంగా వరంగల్, హనుమకొండ పట్టణాల పరిధిలో చాలా స్థలాలను ఖాళీగా వదిలేశారు. కొన్ని ఖాళీ ప్లాట్లు ఉండటంతో అక్కడ పిచ్చి మొక్కలు పెరిగి దోమలకు ఆవాసాలుగా మారాయి. వాటన్నింటినీ జీడబ్ల్యూఎంసీ గుర్తించింది. ఖాళీ స్థలాల యాజమానులకు అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. పిచ్చిమొక్కలతో స్థలాలను వదిలేయకుండా వాటిని శుభ్రంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ పట్టించుకోకుండా ఉండే యజమానులకు జరిమానాలు జారీ చేయాలని నిర్ణయించింది. మూడ్రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో విజయవంతంగా డ్రోన్ వినియోగం ట్రయల్ రన్‌ను చేపట్టారు. విజయవంతంగా పనిచేయటంతో రానున్న రోజుల్లో డ్రోన్ మిషన్‌ను కొనుగోలు చేయాలని అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. డ్రోన్ మిషన్ నడిపేందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రణాళిక ద్వారా ఓరుగల్లు వాసులకు దోమల నుంచి శాశ్వతంగా విముక్తి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

'నా 26 ఏళ్ల సర్వీసులో 20 ట్రాన్స్‌ఫర్‌లు'

ఏ పోస్టింగ్ ఇచ్చినా తగ్గేది లేదన్న సజ్జనర్

అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ డీజీగా వీసీ సజ్జనర్ బాధ్యతలు స్వీకరించారు

ఈ సందర్భంగా సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంపై స్పందించారు



తనపై సోషల్ మీడియాలో విపరీతంగా వస్తున్న విమర్శలపై అగ్నిమాపక శాఖ డీజీ వీసీ సజ్జనర్ స్పందించారు. కొందరు తమ ఉనికి చాటుకునేందుకే తన ఫోటో, పేరు వాడుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండా చేసే ఆరోపణలకు కాలమే సమాధానం చెబుతుందని ఆయన హెచ్చరించారు.హైదరాబాద్ సీపీగా ఉన్న సజ్జనర్‌పై ప్రభుత్వం బదిలీ వేటు వేయడంతో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి నాగేశ్వర్ రావు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'సజ్జనర్ యూనిఫాం వేసుకున్న ఒక క్రిమినల్ అని అందులో రాసుకొచ్చారు' ఆ వ్యాఖ్యలపై సజ్జనర్ పరోక్షంగా స్పందించారు. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ డీజీగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సజ్జనర్ విలేకరుల ప్రశ్నలకు బదులిచ్చారు.తాను సర్వింగ్ ఆఫీసర్‌ని, రోడ్డుపైకి వచ్చి గొడవ చేసే పరిస్థితి లేదని సజ్జనర్ అన్నారు. తన పేరు, సోషల్ మీడియాలో హ్యాష్‌ట్యాగ్ పెడితే మైలేజ్ వస్తుందని కొందరు అలా చేస్తున్నారని, సమయం వచ్చినప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు. వీటన్నింటిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తన 26 ఏళ్ల సర్వీసులో ఏం చేశానో, తన త్యాగమేంటో తెలంగాణ ప్రజలందరికీ తెలుసన్నారు. 26 ఏళ్లలో 20 పోస్టింగ్‌లు వచ్చాయని, ప్రభుత్వం ఏ బాధ్యత అప్పగించినా అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. ఏ పోస్టింగ్ ఇచ్చినా తగ్గేది లేదని చెప్పుకొచ్చారు.

హైదరాబాద్‌లో పాడ్ ట్యాక్సీలతో ట్రాఫిక్ జామ్‌లకు చెక్

ఎకో ఫ్రెండ్లీ ప్రయాణం!

హైదరాబాద్‌లో బిజీబిజీ జీవితంలో గజిబిజీ ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారుతోంది

ట్రాఫిక్‌కు చెక్ పెట్టేందుకు పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(పీఆర్‌టీఎస్)ను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది



ఉరుకుల పరుగుల హైదరాబాద్ మహానగరంలో మెట్రో రైలు రాకతో మూడు ప్రధాన మార్గాల్లో ప్రయాణం కొంత సులభమైంది. అయితే మెట్రో దిగాక కార్యాలయానికో, ఇంటికో, ఇతర గమ్యస్థానానికో వెళ్లాలంటే మళ్లీ ట్రాఫిక్‌తో ఇబ్బందులు తప్పడం లేదు. సరైన ప్రజారవాణా అందుబాటులో లేకపోవడం, క్యాబ్‌లకు అధిక ధరలు వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇందుకు పరిష్కారంగా పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (పీఆర్టీఎస్) లేక పాడ్ ట్యాక్సీలు అంటే డ్రైవర్ లేకుండా నడిచే, బ్యాటరీతో పనిచేసే ఆధునిక పాడ్ ట్యాక్సీ అన్నమాట. ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది.పాడ్ ట్యాక్సీల వ్యవస్థపై అధ్యయనం తర్వాత కేపీహెచ్‌బీ-బయోడైవర్సిటీ, ఎల్బీస్టేడియం- రాణిగంజ్, అసెంబ్లీ - బేగంపేట మార్గాలను సీఎం రేవంత్‌రెడ్డి ఎంపిక చేశారు. దీంతో ఈ మార్గాల్లో పీఆర్టీఎస్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు డిసెంబరు నాటికి టెండర్ ప్రక్రియను పూర్తిచేయాలని మెట్రోరైలు అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ప్రాజెక్టు పూర్తి అయితే ట్రాఫిక్‌తో ఇబ్బంది లేకుండా సౌకర్యవంతంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు.ఈ వ్యవస్థలో పాడ్‌ట్యాక్సీలు నడిపేందుకు ప్రత్యేకంగా ఎలివేటెడ్ ట్రాక్‌లు నిర్మిస్తారు. వాటిపై ఉండే గైడ్‌వేలు (పాడ్ ట్యాక్సీలు తిరిగే మార్గం), ట్రాక్‌లపై టాక్సీలు రాకపోకలు సాగిస్తాయి. ఈ వాహనాలకు డ్రైవర్లు ఉండరు. మెట్రో మాదిరే పూర్తిగా మానవ సహాయం అవసరం లేకుండా, కేంద్రీకృత కంట్రోల్ వ్యవస్థ ద్వారా నడుస్తాయి. చిన్న కారు మాదిరి ఉండే పాడ్‌ట్యాక్సీలో నలుగురు నుంచి ఆరుగురు వరకు ప్రయాణించ వచ్చు. ఒకేసారి 15 నుంచి 20 మంది ప్రయాణించేలా గ్రూప్ ర్యాపిడ్ టాన్సిట్ (జీఆర్‌టీ) వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రయాణికులు పాడ్‌కార్ ఎక్కిన తర్వాత అందులో ఉండే టచ్‌పాడ్ సహాయంతో తాము చేరాల్సిన గమ్యస్థానాన్ని ఎంచుకుంటారు.మెట్రోస్టేషన్లు, రవాణా కేంద్రాల నుంచి సమీపంలోని ఐటీ పార్కులు, కార్యాలయాలు, నివాస ప్రాంతాలకు చేరుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి. బ్యాటరీతో నడుస్తాయి, కాబట్టి కాలుష్యం బెడద ఉండదు. గంటకు 35 నుంచి 44 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేయగలవు.ప్రస్తుతం ప్రపంచంలోని ఆరు ప్రధాన ప్రాంతాల్లో వివిధ రకాల గైడ్ వేలు, స్టేషన్ల డిజైన్లతో పీఆర్టీఎస్ సేవలు అందుతున్నాయి. భూమిపై నడిచే ట్రాక్‌లతోపాటు గాలిలో కేబుల్స్, పైభాగపు ట్రాక్‌లకు వేలాడుతూ ప్రయాణించే వాహనాలు ఇలా 8 రకాల విభిన్న సాంకేతికతలతో పీఆర్టీ వ్యవస్థలు ఉన్నాయి. తెలంగాణలో ఎలివేటెడ్ ట్రాక్‌ల డిజైన్‌కే అధికారులు మొగ్గుచూపుతున్నారు.మన దేశంలో తొలిసారిగా ముంబయిలోని బాంద్రా- కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) లో 8.5 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ పీఆర్టీ ప్రాజెక్ట్ చేపట్టారు. అల్ట్రా పీఆర్టీ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం లండన్‌లోని హీత్రో విమానాశ్రయంలో వాడే సాంకేతికత కూడా ఇదే. యూకేకి చెందిన అల్ట్రా పీఆర్టీతో కలిసి హైదరాబాద్‌కు చెందిన సంస్థే ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది.

కిలో చికెన్ రూ.99కే ఇస్తామన్నారు.. ఇక చూస్కోండి!

నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో రూ.99కే కిలో చికెన్ ఆఫర్

కార్తీక మాసంలో గిరాకీ తగ్గడంతో యజమాని నిర్ణయం

సాధారణంగా కిలో రూ.250కి పైగా ఉన్న చికెన్ ధర

ఆఫర్‌తో చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన జనం

షాపు వద్ద తోపులాటతో చిన్నపాటి తొక్కిసలాట వాతావరణం



తెలంగాణలోని నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండల కేంద్రంలో ఓ చికెన్ దుకాణం వద్ద అనూహ్య రీతిలో జనం ఎగబడ్డారు. సాధారణ రోజుల్లో కిలో రూ.250 కంటే ఎక్కువగా ఉండే చికెన్‌ను కేవలం రూ.99కే విక్రయిస్తున్నట్లు ప్రకటించడంతో కొనుగోలుదారులు భారీగా తరలివచ్చారు. స్థానిక భారత్ చికెన్ సెంటర్ యజమాని ప్రకటించిన ఈ ప్రత్యేక ఆఫర్ స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది.ప్రస్తుతం పవిత్ర కార్తీక మాసం నడుస్తుండటంతో అత్యధికులు మాంసాహారానికి దూరంగా ఉంటున్నారు. ఈ ప్రభావంతో చికెన్ విక్రయాలు భారీగా పడిపోయాయి. దుకాణానికి గిరాకీ పూర్తిగా మందగించడంతో, వినియోగదారులను ఆకర్షించేందుకు యజమాని వినూత్న ఆలోచన చేశారు. భారీ నష్టాలను తగ్గించుకునేందుకు కిలో చికెన్‌ను కేవలం రూ.99కే అందిస్తున్నట్లు బంపర్ ఆఫర్ ప్రకటించారు.ఈ ఆఫర్ గురించి తెలియగానే స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో దుకాణం వద్దకు చేరుకున్నారు. తక్కువ ధరకు వస్తుండటంతో ఒక్కొక్కరు ఐదారు కిలోల చొప్పున కొనుగోలు చేయడానికి పోటీ పడ్డారు. ఒక్కసారిగా భారీ ఎత్తున జనం తరలిరావడంతో దుకాణం వద్ద పరిస్థితి అదుపు తప్పింది. ఒకరినొకరు నెట్టుకోవడంతో తోపులాట జరిగింది. కొద్దిసేపు చిన్నపాటి తొక్కిసలాట లాంటి వాతావరణం ఏర్పడి ఉద్రిక్తత నెలకొంది. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.కార్తీక మాసంలో గిరాకీ లేక వెలవెలబోయిన చికెన్ సెంటర్‌కు ఊహించని రీతిలో కస్టమర్లు పోటెత్తడంతో యజమాని ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. నష్టాల నుంచి గట్టెక్కడానికి పెట్టిన ఈ చిన్న ఆఫర్, ఆ ప్రాంతంలో తీవ్ర రద్దీకి దారితీయడం విశేషం.

అన్నవరంలో కార్తికమాసం శోభ

6 రోజుల పాటు ఉత్సవ సందడి

పవిత్ర కార్తికమాసం సందర్భంగా నేటి నుంచి ఆరు రోజుల పాటు

అన్నవరం దేవస్థానంలో సందడి వాతావరణం నెలకొననుంది



కార్తిక మాసం ఆధ్యాత్మిక చింతనకు, శివారాధనకు, దీపారాధనకు అత్యంత విశిష్టమైన మాసం. ఇలాంటి పవిత్ర కార్తికమాసం సందర్భంగా నేటి నుంచి ఆరు రోజుల పాటు అన్నవరం దేవస్థానంలో సందడి వాతావరణం నెలకొననుంది. పర్వదినాలు, సెలవు రోజులు, ఉత్సవాలతో ఆలయం కిటకిటలాడనుంది. 19, 20 తేదీల్లో దశమి, ఏకాదశి పర్వదినాలు, 21, 22, 23 తేదీల్లో శని, ఆది, సోమవారాలు కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. 24న కార్తిక పౌర్ణమి, గిరిప్రదక్షిణ ఉంది. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా తెల్లవారు జాము 1-3 గంటల మధ్య వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. సుమారు 35-40 వేల వ్రతాలు జరుగుతాయని అంచనా.నిరంతరాయంగా భక్తులకు తాగునీరు, పిల్లలకు పాలు, బిస్కెట్లు అందించేందుకు ఆలయ అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్నారు. స్వామివారి గోధుమ నూక ప్రసాదం కూడా కొరత లేకుండా ఎప్పటికప్పుడు నాణ్యతగా అందించేందుకు చర్యలు చేపట్టారు. పులిహోర, దద్దోజనం పంపిణీ చేయనున్నారు. భక్తుల భద్రత, రవాణా, ఇతర వాటిపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో వసతి గదులకు డిమాండ్ ఏర్పడింది. వసతి దొరకని వారికి కొండ దిగువన కళాశాల ప్రాంగణం, కొండపైన సీఆర్వో కార్యాలయం, వనదుర్గ అమ్మవారి ఆలయాల వద్ద ఉచిత డార్మెటరీలు అందుబాటులో ఉంచారు.21న పంపా సరోవరంలో సత్యదేవుని తెప్పోత్సవం జరగనుంది. ఉత్సవంలో స్వామి, అమ్మవార్లకు పూజ చేసేందుకు వేదిక సిద్ధం చేస్తున్నారు. హంస వాహనాన్ని సిద్ధం చేసి ఈవో చక్రధరరావు, ఇంజినీరింగ్ అధికారుల సమక్షంలో నిన్న (బుధవారం) ట్రయల్ రన్ నిర్వహించారు. నేడు అధికారికంగా మరోసారి ట్రయల్ రన్ జరుగుతుంది. 24న గిరిప్రదక్షిణకు కూడా రహదారిని సిద్ధం చేశారు. పౌర్ణమి పర్వదినం కావడంతో అత్యధికంగా వ్రతాలు కూడా జరగనున్నాయి. కొండపై రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు, కొండ దిగువన గిరిప్రదక్షిణకు హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు, పంపా హారతులు, జ్వాలాతోరణం కార్యక్రమాల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రణాళిక చేశారు.కార్తికమాసంలో సత్యదేవుని దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా డిజిటల్‌తో పాటు నగదు లావాదేవీలకు అవకాశం కల్పిస్తూ కమిషనర్ కె. రామచంద్రమోహన్ ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం ఆలయంలో డిజిటల్ చెల్లింపులు అమలు చేస్తున్నారు. దీనివల్ల చాలామందికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో పీవోఎస్ యంత్రాల్లో అవసరమైన మార్పులు చేసి నగదు లావాదేవీల సదుపాయాన్ని కల్పించాలని ఈవో కోరారు. దీనిపై పరిశీలించిన కమిషనర్ భక్తులు వ్రతం, దర్శనాలు, సేవలు, ప్రసాదం టికెట్లను కౌంటర్ల వద్ద బుక్ చేసుకొనేటప్పుడు నగదు రూపంలో కూడా చెల్లింపులు చేసే వీలు కల్పించేందుకు అనుమతి ఇచ్చారు.

రెడ్డిగూడెం అడవిలోకి పెద్దపులి

డ్రోన్లతో నిఘా, రంగంలోకి పుణె నిపుణులు

ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట అడవిలోకి పెద్దపులి ప్రవేశించింది

డ్రోన్లతో నిఘా పెట్టిన అధికారులు, పుణె నిపుణులతో పులిని బంధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు



ఎన్టీఆర్ జిల్లాలో పెద్దపులి సంచారం మరోసారి కలకలం రేపుతోంది. రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట అటవీ ప్రాంతంలోకి పెద్దపులి ప్రవేశించినట్లు అధికారులు నిర్ధారించారు. బుధవారం ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల సరిహద్దుల్లోని రమణక్కపేట అటవీ ప్రాంతంలో ఈ పులి సంచరించింది. అక్కడి నుంచి దాదాపు 15 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇవాళ రెడ్డిగూడెం మండల పరిధిలోకి చేరుకుంది. పులి సంచారానికి సంబంధించిన పక్కా సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, పోలీసు శాఖలకు సమాచారం అందించి సంయుక్తంగా రక్షణ చర్యలు చేపట్టారు.అన్నేరావుపేట అడవిలోకి ప్రవేశించిన పెద్దపులి కదలికలను అటవీ శాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం ట్రాక్ చేస్తున్నారు. పులి ఎటువైపు వెళ్తుందో తెలుసుకునేందుకు డ్రోన్ కెమెరాలను రంగంలోకి దించారు. డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు పులి కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నామని తిరువూరు ఆర్డీవో ఏ. కుమార్ తెలిపారు. పులికి ఎటువంటి హాని కలగకుండా సురక్షితంగా బంధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోందని ఆయన స్పష్టం చేశారు.పెద్దపులిని సురక్షితంగా బంధించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపుతున్నారు. ఇందుకోసం పుణెతో పాటు నాగార్జునసాగర్ రిజర్వు ఫారెస్ట్ నుంచి ప్రత్యేక నిపుణులను రప్పిస్తున్నట్లు ఆర్డీవో కుమార్ వెల్లడించారు. ఆయా నిపుణుల బృందాలు చేరుకున్న వెంటనే పులిని బంధించే ఆపరేషన్‌ను వేగవంతం చేయనున్నారు. అప్పటివరకు అటవీ ప్రాంత సమీప గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు.పులి సంచారం నేపథ్యంలో వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో కుమార్ సూచించారు. ఎవరూ కూడా పొలాలకు ఒంటరిగా వెళ్లకూడదని స్పష్టం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో గుంపులుగా మాత్రమే వెళ్లాలని తెలిపారు. ఎక్కడైనా పులి కనిపించినా లేదా దాని పాదముద్రలను గుర్తించినా వెంటనే అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు ఎవరూ అనవసరంగా భయాందోళనలకు గురికావద్దని, అప్రమత్తంగా ఉంటూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఆర్డీవో ఏ. కుమార్ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో ఏడుగురు అన్నదమ్ముల దోపిడీపై విచారణ ఏదీ

కేపీ పాల్ ప్రశ్న

రేవంత్ పాలనలో అవినీతి పెరిగిపోయిందన్న కేపీ పాల్

భారత్ సమ్మిట్ పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపాటు

ప్రజలకు తాగునీరు ఇవ్వలేరు కానీ వందల కోట్లు ఖర్చు చేస్తారా అని ప్రశ్న



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేపీ పాల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో అవినీతి పాలన తారాస్థాయికి చేరిందని, ప్రభుత్వం ప్రజాధనాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఎండగట్టారు.రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ములు.. ఏడుగురూ కలిసి లక్షల కోట్ల రూపాయల ఆస్తులను దోచుకున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు బహిరంగంగా ఆరోపిస్తున్నారని కేపీ పాల్ పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నా ఇప్పటివరకు దీనిపై ఎలాంటి విచారణ చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇటీవల నగరంలోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన 'భారత్ సమ్మిట్' కార్యక్రమంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సదస్సు కోసం ఎన్ని వందల కోట్లు ఖర్చు చేశారో ప్రభుత్వం లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ సమ్మిట్ పేరుతో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతో పాటు పలువురు నేతలను పిలిపించి విలాసవంతమైన వేడుకలు నిర్వహించారని, ఇదంతా ప్రజల కళ్ల ముందే జరిగిందని ఆరోపించారు. అయితే కొన్ని మీడియా సంస్థలు ఈ అంశాన్ని ఎందుకు ప్రస్తావించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఒకవైపు రాష్ట్రంలో ప్రజలకు కనీసం గుక్కెడు తాగునీరు కూడా అందించలేని దుస్థితిలో ఉన్న ప్రభుత్వం, ఇలాంటి సదస్సులకు ప్రజాధనాన్ని వృథా చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. రేవంత్ రెడ్డి సర్కారు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు.

'గుండె' ఆరోగ్యం మీ నిద్ర టైమింగ్ లోనే ఉంది - ఇదే సరైన సమయమంటున్న నిపుణులు!

ఏ టైమ్‌లో నిద్రపోతే గుండె ఆరోగ్యానికి మంచిది పరిశోధనలు ఏం చెబుతున్నాయి. ఆరోగ్యకరమైన జీవనశైలికి సరైన నిద్ర, పోషకాహారం ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల లాంటివి. మనం హెల్తీగా ఉండటానికి మంచి ఆహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో, అంతే సమానంగా ప్రశాంతమైన నిద్ర కూడా అవసరమని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నిద్ర సరిగ్గా పోకపోయినట్లయితే గుండెకు సంబంధిన ఆరోగ్యసమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఎంతసేపు నిద్రపోతున్నాం అనే దానితో పాటు నిద్రపోయే సమయం కూడా చాలా ఇంపార్టెంట్ అని సూచిస్తున్నారు. ఇంతకీ, ఏ సమయంలో నిద్రపోతే గుండె ఆరోగ్యానికి మంచిది గుడ్ హెల్త్ కోసం రోజుకు ఎన్ని గంటలు నిద్రపోవాలి వంటి వివరాలను ఈ స్టోరీలో తెలుసుకుందాం.నిద్ర అనేది మన ఆరోగ్యానికి ఒక రక్షణ కవచం లాంటిది. ప్రతి ఒక్కరూ తగినంత నిద్రపోయే ఎలాంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవు. కానీ, ఎప్పుడైతే ఆ నిద్ర సమయం తగ్గుతుందో, అప్పుడే శరీరంలో అనారోగ్య సమస్యలు మొదలవుతాయి. సాధారణంగా ఒక మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటల నిద్రపోవాలని సూచిస్తుంటారు వైద్య నిపుణులు. ఒకవేళ అంతకంటే తక్కువ సమయం నిద్రపోతే మాత్రం ఆరోగ్యపరంగా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని సలహా ఇస్తుంటారు. ముఖ్యంగా నిద్రలేమి గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందంటున్నారు.



గుండె ఆరోగ్యానికి నిద్ర ముఖ్యం :

తగినంత సమయం నిద్రపోకపోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు ప్రముఖ కార్డియాలజిస్టు ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ. చాలా మంది నిద్రను నిర్లక్ష్యం చేస్తుండటం వల్ల గుండెకు సంబంధించిన వ్యాధుల బాధితులుగా మారుతున్నారంటున్నారు. నిద్ర సరిగ్గా పోనట్లయితే గుండె జబ్బులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని పలు అధ్యయనాల్లో వెల్లడైందని చెబుతున్నారు.చిన్న వయసులోనే 'తెల్ల జుట్టు' వస్తోందా – ఈ మార్పులే 'కారణం' కావొచ్చంటున్న నిపుణులు

6-8 గంటల నిద్ర తప్పనిసరి :

6 గంటల కన్నా తక్కువ, 8 గంటల కన్నా ఎక్కువ నిద్రపోయే వారికి గుండె సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అలాగే, ఎన్ని గంటలు నిద్ర అనే ప్రాతిపదికన కాకుండా ఏ సమయంలో నిద్రకు ఉపక్రమిస్తున్నారు అనే దాని మీద కూడా పలు పరిశోధనలు జరిగాయని చెబుతున్నారు డాక్టర్ ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ.వీటిల్లో ఒక అధ్యయనాన్ని పరిశీలిస్తే, రాత్రి 10 గంటల నుంచి 11 గంటల ప్రాంతంలో నిద్రపోయే వారిలో గుండె సంబంధిత సమస్యలు తక్కువగా వస్తున్నాయి. ఆ తర్వాత నిద్రపోయే వారిలో గుండె సమస్యలు ఎక్కువగా వస్తున్నట్లు ఈ అధ్యయనం చెబుతుందని ప్రముఖ కార్డియాలజిస్టు ఎంఎస్ఎస్. ముఖర్జీ వివరిస్తున్నారు. ఇలా నిద్రించే సమయం తక్కువగా ఉన్నా, లేదంటే సమయానికి నిద్రపోకపోయినా గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.నిద్రలేమి ముప్పు నుంచి తప్పించుకోవాలంటే సరైన సమయానికి పడుకోవడం, తగినన్ని గంటలు నిద్రపోవడం ఎంతో కీలకమని సూచిస్తున్నారు ప్రముఖ కార్డియాలజిస్టు ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ. ఇక ప్రస్తుత రోజుల్లో చాలా మంది పిల్లలు, పెద్దలు రాత్రి వేళల్లో మొబైల్స్, టీవీల స్క్రీన్లకు అతుక్కుపోవడం వల్లే నిద్రలేమి సమస్యను కొనితెచ్చుకుంటున్నారంటున్నారు. ఈ అలవాటును మార్చుకుని, పడుకునే ముందు స్క్రీన్ టైమింగ్‌ను తగ్గించుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చని వైద్యులు సలహా ఇస్తున్నారు. ప్రశాంతమైన, సరైన నిద్ర వల్ల మానసిక ఒత్తిడి దూరం అవ్వడమే కాకుండా, ఇతర ఆరోగ్యపరమైన ఇబ్బందులూ దరిచేరవని చెబుతున్నారు.

చేతిలో తాళాలు పెడితే "మూర్ఛ " తగ్గుతుందా..ఫిట్స్ వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలివే

మూర్ఛ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఏటా ప్రతి సంవత్సరం నవంబర్ 17న "నేషనల్ ఎపిలెప్సీ డే" నిర్వహణ

ఫిట్స్‌కు సంబంధించి ముఖ్య వివరాలు మీకోసం.

మూర్ఛ.. ఫిట్.. సీజర్.. ఎపిలెప్సీ.. పేరేదైనా ప్రస్తుతం చాలా మంది ఈ సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. మెదడు నరాలకు సంబంధించిన ఈ వ్యాధి ఒక్కసారి ఎటాక్ అయితే దీర్ఘకాలిక రుగ్మతగా మారిపోతుంది. అయితే ఇప్పటికీ మూర్ఛకు సంబంధించి చాలా మందిలో అపోహలు ఉన్నాయి. అందులో మూర్ఛ వచ్చిన వ్యక్తికి వెంటనే తాళాలు చేతిలో పెట్టడం, ఇనుప వస్తువులు మెడలో వేయడం ముఖ్యమైనవి. ఈ క్రమంలోనే అసలు చేతిలో తాళాలు పెడితే ఫిట్ తగ్గుతుందా అనే వివరాలతో పాటు "నేషనల్ ఎపిలెప్సీ డే" సందర్భంగా అసలు మూర్ఛ ఎందుకు వస్తుంది లక్షణాలు, కారణాలు, ఎవరికైనా ఆకస్మాత్తుగా ఫిట్స్ వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ స్టోరీలో చూద్దాం.మూర్ఛ ఎందుకు వస్తుంది: మూర్ఛ లేదా ఫిట్‌కు మూలం మెదడులో ఉన్నట్టుండి విద్యుత్ సంక్షోభం తలెత్తటం అని సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్ న్యూరోసర్జరీ హెచ్ఓడీ డాక్టర్ మానస్ పాణిగ్రాహి వివరిస్తున్నారు. మన మెదడులోని నాడీ కణాల మధ్య సమాచారం మొత్తం విద్యుత్ ప్రచోదనాల రూపంలో ప్రసారమవుతుందని.. ఈ ప్రచోదనాలు ఒక కణం నుంచి మరో కణానికి ఒక పద్ధతిగా ప్రవహిస్తుంటాయంటున్నారు. ఎప్పుడైనా ఇవి మెదడులో ఒక్కసారిగా ఉద్ధృతమైతే ఆ భాగం పనితీరు అస్తవ్యస్తమై ఫిట్ వస్తుందని చెబుతున్నారు. ఇక ఇలాంటి మూర్ఛలు ఎలాంటి తాత్కాలిక కారణాలు లేకుండా రెండు లేదా అంతకంటే ఎక్కువ సార్లు వస్తే, ఆ దీర్ఘకాలిక వ్యాధిని వైద్య పరిభాషలో "ఎపిలెప్సీ" అంటారని పేర్కొంటున్నారు.మూర్ఛ రావడానికి కారణాలు: మూర్ఛ రావడానికి కచ్చితమైన కారణం తెలియకపోయినా, కొన్ని అంశాలు ఫిట్స్‌కు దారి తీస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటంటే.తలకు బలమైన దెబ్బ తగలటంప్రసవ సమయంలో శిశువు మెదడుకు ఆక్సిజన్ అందకపోవడం లేదా మెదడు నిర్మాణంలో లోపాలు.మెదడు వాపు వ్యాధి, మెనింజైటిస్ బ్రెయిన్ స్ట్రోక్ మెదడులో కణితులు అతిగా మద్యం సేవించడం రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పడిపోవడం డీహైడ్రేషన్

జన్యుపరమైన కారణాలు లక్షణాలు



చాలా మంది మూర్ఛ వస్తే కేవలం కింద పడి కాళ్లు, చేతులు కొట్టుకుంటారని భావిస్తుంటారు. కానీ ఇది ఒక్కటే కాదని, మెదడులోని ఏ భాగంలో విద్యుత్ సంక్షోభం తలెత్తుతుందో దానిని బట్టి లక్షణాలు మారుతుంటాయని చెబుతున్నారు. అందులో కొన్ని కొందరు అయోమయంగా ప్రవర్తించడం లేదా శూన్యంలోకి చూస్తూ ఉండిపోవడంఆకస్మాత్తుగా స్పృహ కోల్పోయి కింద పడటం. విపరీతమైన వణుకు నోటి నుంచి నురగ తీవ్రమైన అలసట, తలనొప్పి, గందరగోళం చేతిలో తాళాలు పెడితే మంచిదేనా: ఎవరైనా వ్యక్తి ఆకస్మాత్తుగా మూర్ఛపోతే చాలా మంది ఆందోళన చెందుతుంటారు. ఈ క్రమంలోనే వారిని సృహలోకి తీసుకొచ్చేందుకు చేతిలో తాళాలు పెట్టడం, ఇనుప వస్తువులను మెడలో వేయడం వంటివి చేస్తుంటారు. అయితే ఇలాంటి పనులు చేయడం అస్సలు మంచిది కాదంటున్నారు నిపుణులు. ఇవి పెడితే మూర్ఛ తగ్గుతుంది అనేది కేవలం అపోహ మాత్రమే అంటున్నారు. సాధారణంగా ఫిట్స్ రెండుమూడు నిమిషాలకు మించి ఉండవని వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే మూర్ఛ వచ్చిన వ్యక్తిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచిస్తున్నారు.ఎవరైనా వ్యక్తి మూర్ఛతో పడిపోతే మీతో పాటు, మీ చుట్టూ ఉన్న వాళ్లు కూడా ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలంటున్నారు.సృహ కోల్పోయిన వ్యక్తి తిరిగి మామూలు అయ్యే వరకు వారి పక్కనే ఉండేలా చూడాలంటున్నారు.ఎవరైనా మూర్ఛతో పడిపోతే వారికి గాయాలు కాకుండా చూసుకోవాలని.. ముఖ్యంగా చుట్టు పక్కల ఉన్న ప్రమాదకర వస్తువులను తీసివేయాలంటున్నారు.వ్యక్తి కింద పడుకుని ఉంటే, గాలి ఆడటానికి వీలుగా మెల్లగా ఒక వైపుకు (నోరు నేల వైపుకు ఉండేలా) తిప్పాలంటున్నారు.మూర్ఛ ఎంతసేపు వస్తుందో గమనించడం ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే 5 నిమిషాల కంటే ఎక్కువ సేపు కొనసాగితే వెంటనే హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలని సూచిస్తున్నారు.ఈ సమయాల్లో అత్యవసర వైద్యం అవసరం: మూర్ఛ పోయిన ప్రతిసారీ వైద్యం అవసరం పడదని, కానీ కొన్ని సమయాల్లో మాత్రం కచ్చితంగా ట్రీట్‌మెంట్ అందించడం ముఖ్యమంటున్నారు నిపుణులు.మూర్ఛ 5 నిమిషాల కంటే ఎక్కువసేపు ఉంటే కొన్ని నిమిషాల గ్యాప్‌లో ఎక్కువ సార్లు మూర్ఛ వస్తే ఫిట్స్ తర్వాత శ్వాస తీసుకోవడంలో ఇబ్బందినీటిలో ఉన్నప్పుడు ఫిట్స్ వస్తే మొదటిసారి మూర్ఛ వస్తేమూర్ఛ వచ్చిన వ్యక్తికి మధుమేహం ఉండి స్పృహ కోల్పోతే మూర్ఛ వచ్చిన వ్యక్తి గర్భిణి అయితే ఈ తప్పులు చేయకూడదు: మూర్ఛ వచ్చినప్పుడు పొరపాటున కూడా కొన్ని పనులు చేయకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఫిట్స్ వచ్చిన వారి కదలికలను ఆపడం లేదా వారిని గట్టిగా పట్టుకోవడం వంటివి చేయకూడదంటున్నారు.ఆ వ్యక్తి నోటిలో నీళ్లు పోయడంతో పాటు ఇతర వస్తువులను పెట్టకూడదని చెబుతున్నారు. దీనివల్ల వారి దంతాలు విరగడం లేదా దవడకు గాయం అయ్యే ప్రమాదం ఉందంటున్నారు.మూర్ఛ వచ్చిన వ్యక్తికి నోటి ద్వారా శ్వాస అందించడం చేయకూడదని వివరిస్తున్నారు.మూర్ఛ పోయిన వ్యక్తి పూర్తిగా స్పృహలోకి వచ్చి, చురుగ్గా మారే వరకు తాగడానికి, తినడానికి ఎలాంటి ఆహారాలను ఇవ్వకూడదని చెబుతున్నారు. అవి గొంతులో ఇరుక్కుని ప్రాణాలకు ప్రమాదం కావొచ్చని హెచ్చరిస్తున్నారు.

రోజుకు చక్కెర, ఉప్పు ఎంత తీసుకోవాలి నిబంధనలు ఏం చెబుతున్నాయంటే

ఉప్పు, చక్కెర వాడకం ఎక్కువైతే ఆరోగ్యానికి ముప్పు

వీటి వాడకం తగ్గించేందుకు ఏం చేయాలి

షుగర్, సాల్ట్ ఎక్కువవాడితే ఆరోగ్యానికి మంచిది కాదనేది చాలామందికి తెలిసిందే. కానీ అసలు వీటిని ఎన్ని గ్రాములు తీసుకుంటే సేఫో మీకు తెలుసా టీ, కాఫీ, బ్రేక్‌ఫాస్ట్, భోజనం, లంచ్, స్నాక్స్, ఇతర డ్రింక్స్ ఇలా రోజులో చాలాసార్లు ఉప్పు, చక్కెర తీసుకుంటూ ఉంటాం. వీటి రుచికి అలవాటుపడి తెలియకుండానే చాలామంది లిమిట్‌కు మించి తీసుకుంటూ ఉంటారు. ఇలా చేస్తుంటే దీర్ఘకాలంలో చాలా రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. అసలు రోజులో చక్కెర ఎంత తీసుకోవాలి ఉప్పు ఎంత వాడొచ్చు వీటిని మోతాదుకు మించి అధికంగా తీసుకుంటే ఆరోగ్యానికి ఎలాంటి రిస్కులు పెరుగుతాయి వీటి వాడకం తగ్గించేందుకు ఏం చేయొచ్చు అనే విషయాలను ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.

రోజుకు ఎంత చక్కెర తీసుకోవచ్చు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ 2024లో కొన్ని మార్గదర్శకాలను విడుదల చేశాయి. సాధారణంగా పెద్దలు రోజుకు 20 నుంచి 25 గ్రాముల చక్కెర మాత్రమే తీసుకోవాలని సూచించాయి. అంటే రోజులో దాదాపు 4 చిన్న టీ స్పూన్ల షుగర్ మాత్రమే తీసుకోవచ్చు. అయితే, టీ, కాఫీలు, స్వీట్లలో వేసే షుగర్ మాత్రమే కాదు, కూల్‌డ్రింక్స్, బిస్కెట్లు, ప్యాకెట్ ఆహారాల ద్వారా అందేది కూడా ఈ లెక్కలోకి వస్తుంది. బెల్లం, తేనె కూడా షుగర్స్ కిందికే వస్తాయి. వీటినీ ఈ లెక్కలో కలుపుకోవాలి. మొత్తంగా ఓ వ్యక్తి రోజుకు 25 గ్రాములలోపే షుగర్స్ తీసుకోవచ్చు. ఒకవేళ మీకు డయాబెటిస్ సహా ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే మీ పరిస్థితిని బట్టి ఈ లిమిట్ గురించి డాక్టర్ సలహా తీసుకోవాలి.

షుగర్ ఎక్కువైతే ఏమవుతుంది

చక్కెరను లిమిట్‌కు మించి ఎక్కువగా తీసుకుంటే దీర్ఘకాలంలో ఆరోగ్యంపై ఎఫెక్ట్ ఎక్కువగానే పడుతుంది. క్యాలరీ ఇన్‌టేక్ పెరిగిపోయి, శరీర బరువు పెరిగే అవకాశం ఉంటుంది. క్రమంగా ఊబకాయం సమస్య రావొచ్చు. టైప్-2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం కూడా అధికంగా ఉంటుంది. కాలేయంలో కొవ్వు పేరుకుపోయే అవకాశం ఉంటుంది. గుండె జబ్బులకు కారణమయ్యే ఇతర ఆరోగ్య సమస్యల ముప్పు కూడా పెరగొచ్చు. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు దంతాలపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా పిల్లల్లో దంతక్షయం వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే వివిధ ఆహారాలు, డ్రింక్స్ ద్వారా రోజుకు ఎంత షుగర్ తీసుకుంటున్నామో తప్పనిసరిగా లెక్కేసుకోవాలి. వీలైనంత వరకు లిమిట్ పాటించాలి. షుగర్ ఇన్‌టేక్ కంట్రోల్ చేసుకుంటే చాలా రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే రిస్క్ తగ్గుతుందని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.

చక్కెర తగ్గించుకోవడానికి టిప్స్ :

కొన్ని టిప్స్ పాటిస్తే చక్కెర తీసుకోవడాన్ని తగ్గించుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. టీ, కాఫీల్లో వేసుకునే షుగర్‌ను కొద్దికొద్దిగా తగ్గించండి. రోజుకు ఎక్కువసార్లు టీ, కాఫీ తాగే అలవాటు ఉంటే, ఆ సంఖ్యను కూడా తగ్గించుకోవాలి. కూల్‌డ్రింక్స్, ప్యాక్డ్ ఫ్రూట్ జ్యూస్‌లు, ఎనర్జీ డ్రింక్స్ మానేస్తే షుగర్ ఇన్‌టేక్ బాగా తగ్గిపోతుందంటున్నారు. వీటికి బదులుగా నీరు, కొబ్బరినీరు, మజ్జిగ వంటివి తాగాలి. తీపి తినాలనిపించినప్పుడు స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లకు బదులుగా పండ్లు, కూరగాయల ముక్కలు తినడం మంచిదని సూచిస్తున్నారు.ఫ్రూట్ జ్యూస్‌ల కంటే పండ్లను నేరుగా తినాలి. ఒకవేళ ఫ్రూట్ జ్యూస్ తాగాల్సి వచ్చినా, దాంట్లో షుగర్ యాడ్ చేయకూడదు. ప్యాకెట్ ఫుడ్స్ కొనేటప్పుడు వాటిపై ఉన్న న్యూట్రిషన్ లేబుల్‌ను తప్పక చదవాలి. చక్కెరతో పాటు సిరప్‌లు, ఇతర తీపి పదార్థాలు ఉన్నాయేమో గవద

ఎనించాలి. బెల్లం, తేనె ఆరోగ్యకరమైనవేనని భావించి ఎక్కువగా తీసుకోకండి. అవి కూడా షుగర్సే. ఈ చిన్న మార్పులతో మీ షుగర్ ఇన్‌టేక్ బాగా తగ్గిపోతుందంటున్నారు నిపుణులు.

రోజుకు ఎంత ఉప్పు తీసుకోవచ్చు

ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ 2024 మార్గదర్శకాల ప్రకారం, పెద్దలు రోజుకు 5 గ్రాములలోపు ఉప్పు తీసుకోవచ్చు. అంటే దాదాపు ఒక టీ స్పూన్. అయితే ఈ లెక్కలో వంటల్లో వేసే ఉప్పుతో పాటు పచ్చళ్లు, చిప్స్, బిస్కెట్లు, సాస్‌లు, ఇతర ప్యాక్డ్ ఆహారాల్లో ఉండేది కూడా లెక్కలోకి వస్తుంది. ఉప్పులో ఉండే సోడియం శరీరానికి అవసరమే. ఇది శరీరంలో ద్రవాల సమతుల్యతకు, నరాలు, కండరాల పనితీరుకు ఉపయోగపడుతుంది. కానీ అవసరానికి మించి సోడియం శరీరంలోకి చేరితే సమస్యలు వస్తాయి. అందుకే సాల్ట్‌ను సరైన మోతాదులో తీసుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.



ఉప్పు ఎక్కువైతే ఏమవుతుంది

ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల గుండె, రక్తనాళాల వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. దీంతో హైబ్లడ్ ప్రెషర్, గుండె వ్యాధులు, పక్షవాతం వచ్చే ప్రమాదం అధికమవుతుంది. శరీరంలో సోడియం ఎక్కువైనప్పుడు ఇన్‌ఫ్లమేషన్, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు వస్తాయి. ఉప్పు ఎక్కువగా తీసుకుంటే మూత్రపిండాలపై ఎఫెక్ట్ పడుతుంది. ఫిల్టరింగ్ వ్యవస్థ దెబ్బతినొచ్చు. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే సమస్య పెరుగుతుంది. ఉప్పు ఎక్కువగా వాడటం వల్ల యూరిన్ ద్వారా శరీరంలోని కాల్షియం ఎక్కువగా బయటకు వెళ్లిపోతుంది. దీనివల్ల దీర్ఘకాలంలో ఎముకల సాంద్రత తగ్గిపోవచ్చు. ఎముకలు తీవ్రంగా బలహీనపడేందుకు ఇది దారితీస్తుంది. ఇప్పటికే బీపీ, గుండె, కిడ్నీల సమస్యలు ఉన్నవారు ఉప్పు విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

ఉప్పు వాడకాన్ని తగ్గించుకోండిలా :

రోజువారీ ఆహారంలో ఉప్పును తగ్గించుకోవడానికి కొన్ని చిన్న మార్పులు చేసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.ముందుగా వంటల్లో ఉప్పును కొద్దికొద్దిగా తగ్గిస్తూ రావాలి. ఆహారానికి రుచి రావడానికి ఉప్పునే ఎక్కువగా వాడాల్సిన అవసరం లేదు.నిమ్మరసం, కొత్తిమీర, అల్లం, వెల్లుల్లి, జీలకర్ర, మిరియాలు వంటి వాటితో రుచి పెంచుకోవచ్చు.చిప్స్, పచ్చళ్లు, అప్పడాలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, ఉప్పు ఉండే బిస్కెట్లు తినడం తగ్గించాలి. వీటిలో సాల్ట్ ఎక్కువగా ఉంటుంది.ప్యాకెట్ ఫుడ్స్ కొనేటప్పుడు దాంట్లో సోడియం ఎంత ఉందనే వివరాలను పరిశీలించండి. భోజనం చేసేటప్పుడు అదనంగా ఉప్పు చల్లుకునే అలవాటు ఉంటే దాన్ని మానుకోవాలంటున్నారు.ఉప్పును కొలిచి వంటల్లో వేసుకోవడం కూడా మంచి పద్ధతి. అయోడిన్ కలిపిన ఉప్పును ఎంచుకోవాలి.పింక్ సాల్ట్, రాక్ సాల్ట్ లాంటి వాటిల్లోనూ సోడియం తక్కువగా ఉంటుందని అనుకోవద్దు. ఈ విషయంలో అన్ని సాల్ట్‌లు ఒకటే. ఏవైనా రోజులో 5 గ్రాములలోపే తీసుకుంటే ఆరోగ్యానికి మేలు అంటున్నారు.

ఈ విషయాలు గుర్తుంచుకోండి :

షుగర్, సాల్ట్ తీసుకోవడం తగ్గించాలంటే ప్రాసెస్డ్, ప్యాక్డ్ ఫుడ్స్, షుగరీ డ్రింక్స్, స్వీట్లు తగ్గించాలి. ఇంట్లో వండిన ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్యాకెట్ ఫుడ్స్ కొంటున్నప్పుడు తప్పనిసరిగా న్యూట్రిషన్ లేబుల్స్ చదవాలి.ఏది ఎంత తీసుకుంటున్నామనే లెక్క చూసుకోవాలి. ఇప్పటికే డయాబెటిస్, అధిక రక్తపోటు, గుండె, మూత్రపిండాల సమస్యలు ఉంటే ఉప్పు, షుగర్ విషయంలో డాక్టర్ సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

కొన్నిరోజుల పాటు అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు పెరిగే ఛాన్స్

ఇన్సులిన్ స్పందనపై ప్రభావం పడే అవకాశం ఉందంటున్న నిపుణులు

ప్రీడయాబెటిస్, మధుమేహం ఉన్నవారు మరింత జాగ్రత్త

షుగర్ ఎక్కువగా ఉంటే ఫాస్టింగ్ గ్లూకోజ్, హెచ్‌బీఏ1సీ పరీక్షలు తప్పనిసరి



పండగలు, పెళ్లిళ్లు, వేడుకలు.. సందర్భం ఏదైనా తీపి పదార్థాలు కనిపిస్తే ఆగడం కష్టమే. ఒకట్రెండు రోజులు కాదు.. వరుసగా కొన్ని రోజుల పాటు స్వీట్లు, కూల్‌డ్రింక్స్, ఇతర తీపి పదార్థాలు అధికంగా తీసుకుంటుంటారు. ఆ తర్వాత మళ్లీ పాత ఆహారపు అలవాట్లకు మారిపోతారు. అయితే అప్పటికీ రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా కనిపిస్తే ఆందోళన చెందాల్సిందేనా కొన్ని రోజుల పాటు చక్కెర అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియపై ప్రభావం పడుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే అందరిలోనూ ఈ ప్రభావం ఒకేలా ఉండదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇప్పటికే ప్రీడయాబెటిస్, మధుమేహం ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

భోజనం తర్వాత షుగర్ పెరగడం సహజమే!

మనం తీసుకునే ఆహారంలోని కార్బోహైడ్రేట్లు జీర్ణమైనప్పుడు గ్లూకోజ్‌గా మారి రక్తంలో కలుస్తాయి. దీంతో భోజనం తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. శరీరంలో ఇన్సులిన్ తగినంతగా ఉత్పత్తి అవుతూ, కణాలు దానికి సరిగ్గా స్పందిస్తే గ్లూకోజ్ స్థాయిలు క్రమంగా తగ్గుతాయి. ఆరోగ్యవంతుల్లో సాధారణంగా భోజనం చేసిన రెండు నుంచి మూడు గంటల్లో రక్తంలో చక్కెర స్థాయిలు భోజనానికి ముందున్న స్థాయికి చేరుకుంటాయి. అయితే మధుమేహం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఉన్నవారిలో ఈ ప్రక్రియ ఆలస్యం కావచ్చు.

కొన్ని రోజుల అతిగా తినడం వల్ల ఏం జరుగుతుంది

చక్కెరతో పాటు మొత్తం కేలరీలు ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయం పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉంది. స్విట్జర్లాండ్‌లోని లొసాన్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఆరోగ్యవంతులైన వ్యక్తులకు ఆరు నుంచి ఏడు రోజుల పాటు అధిక మోతాదులో ఫ్రక్టోజ్, గ్లూకోజ్ అందించి పరిశీలించారు. దీంతో కాలేయంలో కొవ్వు నిల్వలు పెరిగాయి. ఇన్సులిన్‌కు కాలేయం స్పందించే సామర్థ్యం కూడా తగ్గినట్లు గుర్తించారు.అయితే ఈ పరిశోధనలో ఉపయోగించిన చక్కెర పరిమాణం చాలా ఎక్కువ. సాధారణంగా పండగల్లో ఒకట్రెండు రోజులు స్వీట్లు తినే పరిస్థితిని ఈ ఫలితాలతో నేరుగా పోల్చలేం. అంతేకాదు.. ఈ మార్పులు ఎంతకాలం కొనసాగుతాయనే విషయాన్ని కూడా ఈ అధ్యయనం నిర్ధారించలేదు.

ప్రీడయాబెటిస్ ఉన్నవారు మరింత జాగ్రత్త

డయాబెటిస్ వచ్చే ముందు దశలో ఉన్నవారికి రక్తంలో చక్కెరను నియంత్రించే సామర్థ్యం ఇప్పటికే కొంత బలహీనంగా ఉంటుంది. ఇన్సులిన్ రెసిస్టెన్స్ కారణంగా శరీర కణాలు ఇన్సులిన్‌కు సరిగ్గా స్పందించవు. ఇలాంటి పరిస్థితుల్లో అధికంగా ఆహారం తీసుకోవడం వల్ల గ్లూకోజ్ నియంత్రణ మరింత కష్టమవుతుంది.భోజనం తర్వాత షుగర్ పెరగడాన్ని సహజమైన ప్రక్రియగా నిపుణులు వివరిస్తున్నారు. అయితే అది ఎంత పెరుగుతోంది ఎంతసేపటికి తగ్గుతోంది అన్నది ముఖ్యమని చెబుతున్నారు. భోజనం తర్వాత తరచూ 180 ఎస్జీ/లూ కంటే ఎక్కువగా నమోదవుతున్నా, ఎక్కువసేపు తగ్గకపోయినా వైద్యులను సంప్రదించాలి.

చక్కెరకు బదులుగా బెల్లం, తేనె వాడితే సరిపోదు

తెల్ల చక్కెర మానేసి బెల్లం, తేనె లేదా బ్రౌన్ షుగర్ తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ పెరగదని అనుకోవడం పొరపాటు. ఇవి కూడా కార్బోహైడ్రేట్ల వనరులే. అలాగే స్వీట్లు మానేసినా అన్నం, బ్రెడ్, బంగాళాదుంపలు వంటి పదార్థాలను అధికంగా తీసుకుంటే షుగర్ స్థాయిలు పెరగవచ్చు. అందుకే ఏ పదార్థం తింటున్నామన్నదే కాకుండా ఎంత పరిమాణంలో తీసుకుంటున్నామన్నది కూడా ముఖ్యం.

షుగర్ నియంత్రణకు ఈ అలవాట్లు పాటించండి

స్వీట్లు, చక్కెర కలిపిన పానీయాలను తగ్గించాలి. అన్నం, ఇతర కార్బోహైడ్రేట్ల పరిమాణాన్ని నియంత్రించాలి.పప్పులు, కూరగాయలు, ప్రొటీన్ ఉండే సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్ల రసాలకు బదులుగా పండ్లను నేరుగా తినాలి. భోజనం తర్వాత వీలైతే 10--15 నిమిషాలు నడవాలి. తగినంత నిద్రపోవాలి. శారీరక శ్రమను కొనసాగించాలి.

ఎప్పుడు వైద్యులను సంప్రదించాలి

సాధారణ ఆహారపు అలవాట్లకు తిరిగి మారిన తర్వాత కూడా షుగర్ స్థాయిలు ఎక్కువగా నమోదవుతుంటే నిర్లక్ష్యం చేయకూడదు. ఫాస్టింగ్ ప్లాస్మా గ్లూకోజ్ 126 ఎస్జీ/లూ లేదా అంతకంటే ఎక్కువగా ఉంటే డయాబెటిస్ ఉండే అవకాశం ఉంది. హెచ్‌బీఏ1సీ పరీక్ష ద్వారా గత మూడు నెలల్లో రక్తంలో సగటు చక్కెర స్థాయిలను అంచనా వేయవచ్చు. ప్రయోగశాల పరీక్షలతో వైద్యులు నిర్ధారించాలి.తరచూ దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్ర విసర్జన, అకస్మాత్తుగా బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపించినా వైద్య సలహా తీసుకోవాలి. వాంతులు, కడుపునొప్పి, లోతైన శ్వాస, తీవ్రమైన నిద్రమత్తు వంటి లక్షణాలు కనిపిస్తే అత్యవసరం వైద్య సహాయం అవసరం.

చెట్ల మధ్య గడిపితే రోగాలు మాయం.. ప్రపంచాన్ని ఆకర్షిస్తున్న నయా వెల్‌నెస్ మంత్రం!



యాంత్రిక జీవనం, ఉరుకుల పరుగుల నగర సంస్కృతి, స్క్రీన్ల ముందే గడిచిపోయే సమయం నేటి మనుషులను తీవ్రమైన మానసిక ఒత్తిడిలోకి నెట్టేస్తున్నాయి. ఈ సమస్యల నుంచి బయటపడేందుకు ఆధునిక వైద్యం కొత్త దారులు వెతుకుతున్న తరుణంల

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 20 - 11 - 2026

స్టాక్ మార్కెట్ క్లోజింగ్ బెల్.. భారీ నష్టాలతో ముగిసిన షేర్ మార్కెట్లు

కొంపలు ముంచిన రంగాలు ఇవే..



వరుసగా రెండు రోజుల లాభాలకు తెరదించుతూ భారత స్టాక్ మార్కెట్లు బుధవారం (నవంబర్ 18) భారీ నష్టాలతో ముగిశాయి. ఇటీవలి ర్యాలీ తర్వాత మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం.. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు దలాల్ స్ట్రీట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 500.38 పాయింట్లు (0.61 శాతం) క్షీణించి 82,031.81 వద్ద స్థిరపడగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ 159.45 పాయింట్లు (0.63 శాతం) నష్టపోయి కీలకమైన 25,250 మద్దతు స్థాయి దిగువన 25,227.95 వద్ద ముగిసింది. ఉదయం మార్కెట్ ప్రారంభం నుంచే అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. మంగళవారం నాటి 25,387.40 ముగింపుతో పోలిస్తే బుధవారం ఉదయం 25,323.15 వద్ద బలహీనంగా మొదలైన నిఫ్టీ, ఇంట్రాడేలో ఒక దశలో 25,172.10 కనిష్ఠ స్థాయిని తాకింది. అదేవిధంగా సెన్సెక్స్ కూడా మధ్యాహ్నం ట్రేడింగ్‌లో ఏకంగా 723 పాయింట్లకు పైగా కుప్పకూలి 81,808.24 స్థాయికి పడిపోయినప్పటికీ, చివరి గంటలో బ్యాంకింగ్, ఫార్మా షేర్ల అండతో కొంతమేర నష్టాలను పూడ్చుకుంది. మార్కెట్ క్యాప్ కూడా బలహీనంగా నమోదైంది. బీఎస్ఈలో సుమారు 1,448 షేర్లు లాభపడగా, ఏకంగా 2,800 షేర్లు నష్టాల్లో ముగిశాయి, మరో 169 షేర్లలో ఎటువంటి మార్పు లేదు. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 1.22 శాతం, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.35 శాతం మేర పడిపోయాయి. నిఫ్టీ 50 సూచీలో వినియోగ వస్తువులు, లోహాలు, ఆర్థిక రంగ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ప్రధానంగా ట్రైటాన్ కంపెనీ, హిండాల్కో ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, బీఎస్ఈ లిమిటెడ్, బజాజ్ ఫైనాన్స్ భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. మరోవైపు, ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ సిప్లా, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ఐటీసీ , అపోలో హాస్పిటల్స్ వంటి షేర్లు కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లో నిలిచి సూచీల పతనాన్ని కొంతవరకు అడ్డుకున్నాయి. ఈ కంపెనీ షేర్లు కొన్నవారికి పండగే పండగ.. ఒక్క రోజే 156 శాతం లాభాలు..కారణం ఏంటంటే..

రంగాల వారీగా పరిశీలిస్తే.. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీ అత్యధికంగా 3 శాతం కుప్పకూలగా, నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 2.4 శాతం క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్లో లోహాల ధరల పతనం, డాలర్ బలోపేతం మెటల్ షేర్లను దెబ్బతీశాయి. అలాగే ఆటో, ఐటీ రంగాల సూచీలు చెరో 1 శాతానికి పైగా నష్టపోయాయి. ఏఐ కాంట్రాక్టుల రీసెట్ ఒత్తిళ్లతో ఐటీ షేర్లలో అమ్మకాలు కొనసాగాయి. దీనికి భిన్నంగా, డిఫెన్సివ్ రంగాలైన ఫార్మా, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు చెరో 0.4 శాతం చొప్పున లాభపడి మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చాయి. అంతర్జాతీయ పరిణామాలను గమనిస్తే.. మంగళవారం రాత్రి అమెరికా మార్కెట్లు భారీ నష్టాలతో ముగియడం ఆసియా, భారత మార్కెట్లపై ప్రభావం చూపింది. డౌ జోన్స్ 1.64 శాతం, ఎస్‌డపి 500 సూచీ 1.03 శాతం పడిపోయాయి. అయితే బుధవారం ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పీ 1.9 శాతం, తైవాన్ సూచీలు లాభపడటం, యూఎస్ ఫ్యూచర్స్ సానుకూలంగా కదలడం కొంత సానుకూల అంశం. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 92.97 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. నవంబర్ నెలలో ఇప్పటివరకు విదేశీ సంస్థాగత మదుపర్లు భారత ఈక్విటీలలో రికార్డు స్థాయిలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టడం దీర్ఘకాలికంగా మార్కెట్‌కు బలమైన అండగా నిలుస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

కుప్పకూలిన రాగి ధరలు.. లబోదిబోమంటున్న ఇన్వెస్టర్లు..



అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లలో లోహాల ధరలు కుప్పకూలడం దేశీయ పారిశ్రామిక, స్టాక్ మార్కెట్ వర్గాలలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. గడిచిన వారం రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా వెండి 8 శాతం, బంగారం 4.5 శాతం, రాగి 4 శాతం, అల్యూమినియం 3 శాతం మేర నష్టాలను మూటగట్టుకున్నాయి. ముఖ్యంగా నవంబర్ 18న కామెక్స్ మార్కెట్లో రాగి ఫ్యూచర్స్ ఒక్కరోజులోనే 5.30 శాతం నుండి 5.45 శాతం మేర పడిపోయి పౌండ్‌కు 5.660 డాలర్ల స్థాయికి చేరుకున్నాయి. ఈ పతనంతో రాగి ధరలు గత ఐదు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడమే కాకుండా.. సెప్టెంబర్ 2026లో నమోదైన ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయి (పౌండ్‌కు ఏ6.85-ఏ6.89) నుండి దాదాపు 17 శాతం మేర దిగివచ్చాయి. లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్ లోనూ రాగి ధర ఇటీవలి గరిష్ఠమైన టన్నుకు ఏ14,870 నుండి సుమారు 11 శాతం క్షీణించి ఏ13,078 స్థాయికి చేరుకుంది. లోహాల మార్కెట్లో ఈ తీవ్ర అమ్మకాల వెనుక ప్రధానంగా ప్రపంచ ఆర్థిక, సాంకేతిక కారణాలు ఉన్నాయి. విద్యుత్ మౌలిక సదుపాయాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, భారీ డేటా సెంటర్ల నిర్మాణంలో రాగిని విస్తృతంగా ఉపయోగిస్తారు. అయితే, ఇటీవల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంబంధిత మౌలిక సదుపాయాలపై కంపెనీల భారీ పెట్టుబడులు మందగించవచ్చనే ఆందోళనలు రాగి భవిష్యత్ డిమాండ్‌పై ఒత్తిడి పెంచాయి. లో కుప్పకూలిన రాగి ధరలు..6 వారాల్లో 10.5 శాతం పతనం.. కాపర్ కొనుగోలుపై ఇన్వెస్టర్లకు కీలక సూచన.. దీనికి తోడు అమెరికాలో ద్రవ్యోల్బణం ఎగబాకడం, బాండ్ ఈల్డ్స్ పెరగడం, డిసెంబర్ 2026లో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశం 90 శాతానికి పైగా ఉందన్న అంచనాలు బంగారం, వెండి సహా పారిశ్రామిక లోహాలను బలహీనపరిచాయి. అమెరికన్ డాలర్ సూచీ 19 నెలల గరిష్ఠ స్థాయికి బలపడటం, ఎల్ఎంఈ గోదాములో రాగి నిల్వలు ఆగస్టు నాటి 2.05 లక్షల టన్నుల నుండి నవంబర్ మధ్య నాటికి 3.20 లక్షల టన్నులకు పెరగడం ధరల పతనాన్ని మరింత వేగవంతం చేశాయి. రాగి ధరల పతనం దేశీయ వైర్లు, కేబుల్స్ తయారీ కంపెనీల షేర్లను గట్టిగా దెబ్బతీసింది. ఈ వారం పాలికాబ్ ఇండియా, ఆర్ఆర్ కేబుల్స్, ఫినోలెక్స్ కేబుల్స్ షేర్లు 6 శాతం నుండి 10 శాతం వరకు నష్టపోయాయి (బుధవారం నాడే పాలికాబ్ 5.12 శాతం, ఆర్ఆర్ కేబుల్స్ మరియు ఫినోలెక్స్ చెరో 3 శాతం మేర పడిపోయాయి). గతంలో రాగి ధరలు మరింత పెరుగుతాయనే అంచనాతో డీలర్లు భారీగా నిల్వలను పోగుచేసుకున్నారు. దీనివల్ల అక్టోబర్-డిసెంబర్ 2025 త్రైమాసికంలో పాలికాబ్ వాల్యూమ్ వృద్ధి దాదాపు 40 శాతం, ఆర్ఆర్ కేబుల్స్ దేశీయ వాల్యూమ్ వృద్ధి 30 శాతానికి పైగా, ఫినోలెక్స్ కేబుల్స్ వైర్ వ్యాపార వృద్ధి 28 శాతంగా నమోదైంది. కానీ ఇప్పుడు రాగి ధరలు పడిపోవడంతో ఫినోలెక్స్ ఇప్పటికే హౌస్ వైర్ ధరలను 3 శాతం తగ్గించగా, పాలికాబ్, ఆర్ఆర్ కేబుల్స్ కూడా అదే బాటలో నడిచే అవకాశం ఉంది. ధరలు ఇంకా తగ్గుతాయనే ఉద్దేశ్యంతో డీలర్లు కొనుగోళ్లను వాయిదా వేస్తుండటంతో, మూడవ త్రైమాసికంలో నిల్వల పెరుగుదల నెమ్మదిస్తుందని ఈక్విరస్ అంచనా వేస్తోంది. కంపెనీల మార్జిన్లు స్థిరంగా ఉన్నప్పటికీ, పాత నిల్వల విలువ తగ్గడం వల్ల యూనిట్‌కు లాభదాయకతపై తాత్కాలిక ఒత్తిడి తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు అల్యూమినియం, ఉక్కు రంగాలలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. యాక్సిస్ క్యాపిటల్ నివేదిక ప్రకారం, 2026 మొదటి తొమ్మిది నెలల్లో ప్రపంచ అల్యూమినియం డిమాండ్ కేవలం 1.2 శాతం మాత్రమే వృద్ధి చెందగా, 2027 నాటికి 0.5 మిలియన్ టన్నుల వార్షిక మిగులు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుతం అల్యూమినా టన్నుకు సుమారు ఏ390 వద్ద ట్రేడ్ అవుతోంది. దీనికి భిన్నంగా, దేశీయ ఉక్కు పరిశ్రమకు కొంత ఊరట లభిస్తోంది. చైనా నుండి దిగుమతి అయ్యే ఉక్కుతో పోలిస్తే దేశీయ ఉక్కు ధరలు 5-6 శాతం ప్రీమియంను కలిగి ఉండగా, కేంద్రం విధించిన సేఫ్‌గార్డ్ డ్యూటీ, బలమైన దేశీయ మౌలిక సదుపాయాల డిమాండ్ ఉక్కు కంపెనీలకు అండగా నిలుస్తున్నాయి. రాబోయే రోజుల్లో డాలర్ కదలికలు, బాండ్ ఈల్డ్స్ మరియు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయంపైనే లోహాల మార్కెట్ భవిష్యత్తు ఆధారపడి ఉండనుంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఒక్క రోజులో మారిన రైతు తలరాత.. రూ.500 లతో రూ.12 కోట్లు.. 15 ఏళ్ల నిరీక్షణకు తెర..!



మనిషి జీవితంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. కోటీశ్వరుడు పేదవాడు కావొచ్చు.. పేదవాడు కోటీశ్వరుడు కావొచ్చు. ఏదైనా జరుగొచ్చు అందుకే ఉన్నాయని మురిసిపోవద్దు. లేవని బాధపడొద్దు. ఒక్కోసారి మన అదృష్టం బాగుంటే కలిసొచ్చే అవకాశం ఉంటుంది. తాజాగా ఏ రైతు ఒక్క రోజులో కోటీశ్వరుడిగా మారిపోయాడు. పంజాబ్ కు చెందిన ఓ రైతు జాక్ పాట్ కొట్టాడు. అయితే అతను జాక్ పాట్ కొట్టడానికి 15 ఏళ్లుగా ప్రయత్నం చేస్తున్నాడు. తాజాగా అతను కొనుగోలు చేసిన లాటరీ టికెట్ భారీ బహుమతి గెలుచుకుంది. రూ.500 లతో కొనుగోలు చేసిన లాటరీ టికెట్ తో రూ.12 కోట్లు గెలుచుకున్నాడు. ఆ రైతు ఒక్క రోజులో కోటీశ్వరుడు అయ్యాడు. రూ.12 కోట్ల లాటరీ తగలడంతో ఆయన కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. ఇంతకీ ఈ రూ.12 కోట్ల బహుమతి గెలుచుకున్న రైతు పేరు చెప్పలేదు కదూ.. ఆయన 45 ఏళ్ల బల్జిందర్ సింగ్. పంజాబ్‌లోని మొహాలీ జిల్లా హమాయున్‌పూర్ గ్రామానికి చెందిన ఆయన వ్యవసాయం చేస్తాడు. బల్జిందర్ సింగ్ వ్యవసాయంతో పాటు ట్రక్ డ్రైవర్ గా కూడా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బల్జిందర్ సింగ్ 2010 లాటరీ టికెట్ కొనుగోలు చేస్తున్నాడు. ఈశ్వరన్ ఆరుముగం: రైతు బిడ్డ.. కోట్లు సంపాదించిన సాఫ్ట్‌వేర్ కంపెనీ అధిపతి! కొన్ని సంవత్సరాలుగా లాటరీ టికెట్ కొనుగోలు చేస్తున్నాడు. అతను ఎప్పుడు లాటరీ టికెట్ కొనుగోలు చేసినా తగిలేది కాదు. ప్రతిసారి లాటరీ ఫలితాలు చూసుకునేవాడు. ఇలా 15 ఏళ్లుగా బల్జిందర్ సింగ్ నిరీక్షణ కొనసాగింది. ఫైనల్ గా ఆయన నిరీక్షణకు తెరపడింది. దీపావళికి ముందు హండేస్రాలోని ఓ లాటరీ విక్రేత వద్ద బల్జిందర్ సింగ్ రూ.500 పెట్టి టికెట్ కొనుగోలు చేశాడు. నవంబరు 16న నిర్వహించిన పంజాబ్ స్టేట్ డియర్ దీపావళి బంపర్ లాటరీ డ్రాలో అతడికి మొదటి బహుమతి వచ్చింది ఆ వార్త విన్న వెంటనే అతడు మొదట్లో షాక్ అయ్యాడు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. దేవుడు తన ప్రార్థనలు విన్నాడని బల్జిందర్ పేర్కొనాడు. తన కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా దాదాపు 15 సంవత్సరాలుగా లాటరీ టికెట్లు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తు చేసుకున్నాడు. ఈ లాటరీ డబ్బులతో తన పిల్లలను బాగా చదివిస్తానని బల్జిందర్ చెప్పాడు. లాటరీ గెలిచిన విషయం గ్రామంలో తెలియడంతో స్థానికులు అతడి ఇంటికి చేరుకుని అభినందనలు చెప్పారు. కాగా

బల్జిందర్ సింగ్ కొన్న లాటరీ టికెట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఒక్క రోజులో 13 శాతం, రెండు వారాల్లో 16 శాతం పెరిగిన స్టాక్ ఇదే..!



బుధవారం ఇండోకో రెమెడీస్ షేర్లు 13 శాతం కంటే ఎక్కువ లాభపడ్డాయి. ఈ ఫార్మా కంపెనీ షేరు గత వారం రోజుల్లో 13.21 శాతం, గత రెండు వారాల్లో 16.25 శాతం రాబడి ఇచ్చింది. ఈ రోజు ట్రేడింగ్‌లో రూ.226.75 వద్ద కనిష్ఠ స్థాయి వద్ద ప్రారంభమైన షేరు, సెషన్ సమయంలో గరిష్టంగా రూ.254.75 స్థాయికి చేరుకుంది. ఈ భారీ పెరుగుదల మార్కెట్ దృష్టిని ఆకర్షించింది. సాంకేతిక నిపుణుల అభిప్రాయం ప్రకారం షేరులో వేగం పుంజుకోవడం, బలమైన ట్రేడింగ్ వాల్యూమ్‌లు నమోదు కావడం, కీలకమైన రెసిస్టెన్స్ స్థాయిలను దాటడం వంటి అంశాలు దీని తదుపరి గమనాన్ని నిర్ణయించనున్నాయని నిపుణులు చెబుతున్నారు. కేవలం 14 ట్రేడింగ్ సెషన్లలోనే ఈ షేరు తన కనిష్ఠ స్థాయి రూ.205.10 నుంచి దాదాపు 24 శాతం పుంజుకుందని ఎస్బీఐ సెక్యూరిటీస్‌లో టెక్నికల్ అండ్ డెరివేటివ్స్ రీసెర్చ్ హెడ్ సుదీప్ షా తెలిపారు. ఈ కోలుకునే క్రమంలో ఇది తన కీలక మూవింగ్ యావరేజ్‌ల కంటే పైకి చేరుకుందని పేర్కొన్నారు. ఇది స్వల్పకాలిక వేగం మెరుగుపడిందని సూచిస్తోందని వివరించారు. అయితే గత కొన్ని నెలలుగా ఈ షేరు రూ.205-288 శ్రేణిలోనే కదులుతూ ఒక నిర్దిష్ట పరిధికి పరిమితమై ఉందని ఆయన పేర్కొన్నారు. ఆయన అంచనా ప్రకారం రూ.230-233 స్థాయి బలమైన సపోర్ట్‌గా పనిచేస్తుందని భావిస్తున్నారు.ఈ కంపెనీ షేర్లు కొన్నవారికి పండగే పండగ.. ఒక్క రోజే 156 శాతం లాభాలు..కారణం ఏంటంటే.. ఇండోకో రెమెడీస్ ఒక సమాంతర ఛానెల్‌లో ట్రేడ్ అవుతుందని సహి రీసెర్చ్ హెడ్ గౌరవ్ అరోరా చెప్పారు. బుధవారం సెషన్‌లో 12 శాతం లాభపడిందని పేర్కొన్నారు. ఈ షేరు కీలక రెసిస్టెన్స్ స్థాయి అయిన రూ.235ని అధిగమించిందని, దీనికి బలమైన ట్రేడింగ్ వాల్యూమ్‌లు తోడయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ షేరు రూ.280-285 స్థాయిల వైపు పయనించే అవకాశం ఉందని భావిస్తున్నట్లు చెప్పారు. రూ.235 స్థాయి పైన షేరు నిలకడగా ఉన్నంత కాలం దాని సాంకేతిక నిర్మాణం సానుకూలంగానే ఉంటుందని, ప్రస్తుతం ఈ రూ.235 స్థాయి ఒక సపోర్ట్ లెవల్‌గా మారిందని ఆయన వివరించారు. స్వల్పకాలంలో, ఈ పెరుగుదల బహుశా 270 వరకు విస్తరించవచ్చు అంచనా వేశారు. 230 వద్ద ఉన్న 89 జుమీా మద్దతుగా పనిచేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆదాయం, నిర్వహణ పనితీరులో వృద్ధి మద్దతుతో 27 రెండో త్రైమాసికంలో ఇండోకో రెమెడీస్ తిరిగి లాభదాయకతను సాధించిన తర్వాత కూడా ఈ ఇటీవలి ర్యాలీ వచ్చిందన్నారు. ఈ ఫార్మాస్యూటికల్ కంపెనీ సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.19.5 కోట్ల నికర లాభాన్ని నివేదించింది. గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.9.2 కోట్ల నికర నష్టంతో పోలిస్తే ఇది ఎక్కువగా ఉంది. ఎబిట్డా 10 శాతం పెరిగి రూ.33 కోట్లకు చేరింది. ఇది ఒక సంవత్సరం క్రితం రూ.30.2 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదే కాలంలోని 6.4 శాతం నుంచి కంపెనీ ఎబిట్డా మార్జిన్ కూడా స్వల్పంగా మెరుగుపడి 6.5 శాతానికి చేరింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఇంటెల్‌లో మరోసారి లేఆఫ్స్.. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగులపై వేటు..



అమెరికాకు చెందిన దిగ్గజ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ తన సుదీర్ఘ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో భాగంగా మరో విడత ఉద్యోగ కోతలను చేపట్టింది. సీఈఓ లిప్-బు టాన్ నేతృత్వంలో కంపెనీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా మార్చే ప్రయత్నాల్లో భాగంగా ఈ తాజా తొలగింపులు జరిగాయి. ముఖ్యంగా ఇంటెల్ యొక్క ప్రపంచవ్యాప్త ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంపై ఈ కోతల ప్రభావం గణనీయంగా పడినట్లు తెలుస్తోంది. తాజా లేఆఫ్స్ వల్ల తాము ఉద్యోగాలు కోల్పోయామని పలువురు ఉద్యోగులు ఈ వారం సోషల్ మీడియా వేదికల ద్వారా వెల్లడించారు. అయితే ఈ విడతలో ఎంతమంది ఉద్యోగులను తొలగించారు, ఏయే నిర్దిష్ట బృందాలపై దీని ప్రభావం పడింది అనే వివరాలను ఇంటెల్ అధికారికంగా వెల్లడించలేదు. దీనిపై ఇంటెల్ ప్రతినిధి 'బిజినెస్ ఇన్‌సైడర్' తో మాట్లాడుతూ.. కంపెనీని మరింత దృష్టి కేంద్రీకృతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే విస్తృత వ్యూహంలో భాగంగా తమ శ్రామిక శక్తిని క్రమం తప్పకుండా మూల్యాంకనం చేస్తున్నామని తెలిపారు. సంస్థ దీర్ఘకాలిక ప్రాధాన్యతలకు అనుగుణంగా వనరులను సర్దుబాటు చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశ్యమని ఆయన స్పష్టం చేశారు. తయారీ రంగంలో ఎదురైన సవాళ్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చిప్‌ల మార్కెట్ వాటాలో ప్రత్యర్థుల చేతిలో వెనుకబడటం వంటి కారణాలతో ఇంటెల్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. వ్యాపారాన్ని తిరిగి గాడిలో పెట్టేందుకు సీఈఓ లిప్-బు టాన్ ఖర్చుల నియంత్రణ, ప్రాజెక్టుల కుదింపు, ఉద్యోగుల తగ్గింపు వంటి కఠిన నిర్ణయాలను అమలు చేస్తున్నారు. ఈ ఏడాది కంపెనీ ఒకేసారి భారీగా కాకుండా, అనేక చిన్న చిన్న విడతలలో ఉద్యోగులను తొలగిస్తూ వస్తోంది. ఒక్క ప్రకటన.. రూ. 11.5 లక్షల కోట్లు నష్టం.. 52 ఏళ్ల తర్వాత ఇంటెల్ భారీ పతనం వెనుక జరిగిందిదే.. గత రెండేళ్లుగా ఇంటెల్‌లో వరుస లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. ఇటీవల జూలై 2026లో తమ కీలకమైన డేటా సెంటర్ గ్రూప్ విభాగంలో ఉద్యోగ కోతలను సంస్థ ధృవీకరించింది. అంతకుముందు, 2025 జూలైలో నవీకరించబడిన కార్మిక శక్తి ఫైలింగ్‌ల ప్రకారం అమెరికా వ్యాప్తంగా 5,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది; ఇందులో ఒరెగాన్ మరియు కాలిఫోర్నియా రాష్ట్రాల ఉద్యోగులే అధికంగా ప్రభావితమయ్యారు. అంతేకాకుండా, 2025 జూలైలోనే టాన్ తన పునర్నిర్మాణ చర్యలను వేగవంతం చేస్తూ మొత్తం 24,000 ఉద్యోగాలను తగ్గించుకోవడంతో పాటు పలు ప్రధాన ప్రాజెక్టులను కుదించే

ప్రణాళికలను వెల్లడించిన విషయం తెలిసిందే. తాజా ఐటీ విభాగ కోతలు కూడా ఆ విస్తృత ప్రణాళికలో భాగమేనని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టాలనుకుంటున్నారా..



ఒకప్పుడు చేతిలో డబ్బు ఉంటే భూమి కొనేవారు. లేకుంటే బంగారం కొనేవారు. ఆ తర్వాత ఎదైనా బీమా (ఎల్ఐసీ ట్రేడిషనల్ పాలసీ) తీసుకునేవారు. ఎఫ్డీలు చేసేవారు. కానీ ఇప్పుడు భూమి ధరలు భారీగా పెరిగిపోయాయి. బంగారం ధరలు కూడా భారీగానే ఉన్నాయి. ఎఫ్డీ వడ్డీ రేట్లు తక్కువగానే ఉన్నాయి. ట్రేడిషనల్ బీమా తీసుకుంటే ప్రయోజనం తక్కువే. అందుకే చాలా మంది ఇప్పుడు ఈక్విటీ మార్కెట్ల వైపు మళ్లుతున్నారు. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేవారు పెరిగిపోతున్నారు. అయితే చాలా మందికి మ్యూచువల్ ఫండ్లపై అవగాహన లేదు. మ్యూచువల్ ఫండ్లు దీర్ఘకాలం మంచి రాబడి ఇస్తాయని నిపుణులు చెబుతున్నారు. రాబడి అనేది ఎంచుకునే ఫండ్ ను బట్టి ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా మ్యూచువల్ ఫండ్లలో ప్రధానంగా మూడు రకాల ఫండ్స్ ఉంటాయి. ఇందులో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు, డెట్ మ్యూచువల్ ఫండ్లు, హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్లు ఉన్నాయి. ఇందులో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు దీర్ఘకాలంలో మంచి రాబడి ఇచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఈక్విటీలో కూడా చాలా ఫండ్స్ ఉంటాయి. లార్జ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు, మిడ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు, స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు, ఇండెక్స్ ఫండ్లు, మల్టీక్యాప్ ఫండ్లు, ఫోకస్డ్ ఫండ్లు, ఫ్లెక్సి క్యాప్ ఫండ్లు, సెక్టోరియల్ మ్యూచువల్ ఫండ్లు ఉంటాయి. అత్యధిక రాబడి ఇచ్చిన లార్జ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు ఇవే..! స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లలో రిస్క్ ఎక్కువగా ఉంటుంది. కానీ రివార్డ్ కూడా అదే విధంగా ఉంటుంది. లాంగ్ టర్మ్ స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్లు మంచి రాబడి ఇచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. రిస్క్ తక్కువ ఉండాలనుకునే వారు లార్జ్ క్యాప్, ఇండెక్స్ ఫండ్లలో పెట్టుబడి పెట్టొచ్చు. రిస్క్ చాలా తక్కువగా ఉండాలనుకుంటే డెట్ ఫండ్లలో పెట్టుబడి పెట్టబడి పెట్టొచ్చు. ఇందులో కూడా రకాలు ఉంటాయి. ఓవర్ నైట్ ఫండ్లు, షార్ట్ డ్యూరేషన్ ఫండ్లు, లో డ్యూరేషన్ ఫండ్లతో పాటు చాలా రకాల



అయ్యప్ప భక్తి నేపథ్యంలో వైభవ్ 'హరిహర పుత్ర'.. ఆకట్టుకుంటున్న టీజర్!

టాలెంటెడ్ హీరో వైభవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'హరిహర పుత్ర' బ్లాక్‌బస్టర్ సినిమా 'మాళిగాపురం' ఫేమ్ విష్ణు శశి శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. స్వామి అయ్యప్ప భక్తి, ఆధ్యాత్మికత మరియు ఉత్కంఠభరితమైన రహస్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రంలో వైభవ్ పూర్తి భక్తిభావంతో కూడిన అయ్యప్ప భక్తుడిగా నటిస్తుండగా, ఆయన సరసన మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితో పాటు ఆదుకాలం నరేన్, అరవింద్ ఆకాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో రవి మోహన్, మిర్చి శివ, వెంకట్ ప్రభు, కృష్ణ, మహాత్, ప్రేమ్‌జీ అమరన్ మరియు గంగై అమరన్ వంటి ప్రముఖులు ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. తంత్రా ఫిలింస్ మణాకంపై జె.కె. శరవణ, ఎం. రాజాయిమ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దీనికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్‌జీ అమరన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.


బ్లాక్ డ్రెస్‌లో
మౌనీ రాయ్
గ్లామర్ షో..
చూపు
తిప్పుకోలేరు!

వయ్యారాలు ఒలకబోస్తున్న రకుల్.. క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కట్టిపడేస్తున్న బ్యూటీ



విమర్శలను మోటివేషన్‌గా మార్చుకుంటున్నా దుల్కర్ సల్మాన్!



ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ ఆన్‌లైన్ నెగెటివిటీ, విమర్శలను ఎదుర్కొనే విధానంపై మరియు అవి తన కెరీర్ ఎంపికలపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయనే దానిపై తాజాగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో తనను తీవ్రంగా కుంగదీసిన విమర్శలు ఇప్పుడు తనకు సులభంగా ఎదుర్కొనేలా మారాయని తెలిపారు. తన ఉద్దేశం ఎప్పుడూ మంచి సినిమాలు చేయడమేనని, ఎంత కష్టపడినా కొద్దిపాటి నెగెటివిటీ రావడం సహజమని ఆయన గ్రహించారు. అయితే, ఆ నెగెటివిటీని తానెప్పుడూ కక్షగా లేదా అసూయగా మార్చుకోలేదని, దాన్ని ఒక మోటివేషన్‌గా తీసుకుని తనని తాను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తానని దుల్కర్ వెల్లడించారు. "కొంతమంది నేను ఒక పాత్ర చేయలేనని భావిస్తే, నేను దాన్ని సవాల్‌గా తీసుకుని చేయడానికి ప్రయత్నిస్తాను. భయపెట్టే లేదా సవాల్‌తో కూడిన పాత్రలను ఎంచుకోవడం వల్ల నటుడిగా నా ఎదుగుదల సాధ్యమైంది. ప్రస్తుతం నాలో ఎలాంటి కసి లేదా పగ లేదు" అని ఆయన భావోద్వేగంగా చెప్పుకొచ్చారు. మరోవైపు, పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తెలుగు డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున ఆయన తండ్రి, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించిన 'ఓ.ఎం: ఆపరేషన్ మోల్' కూడా విడుదలవుతుండటంతో, బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది.

తిరువీర్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్.. 'మసూద' సినిమాకు 4 ఏళ్లు!



టాలీవుడ్ వర్ధమాన నటుడు తిరువీర్ కెరీర్‌లో టిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంచలనాత్మక హారర్ థ్రిల్లర్ 'మసూద' సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం, ఎలాంటి భారీ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా 2022 నవంబర్ 18న విడుదలై బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. అప్పట్లో ప్రేక్షకులను భయపెడుతూనే బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన ఈ సినిమా, తాజాగా విడుదలై నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఈ చిత్రంలో కేవలం భయపెట్టే హారర్ సన్నివేశాలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులను కట్టిపడేసే బలమైన భావోద్వేగాలు ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులు దీనికి కనెక్ట్ అయ్యారు. ఒక సాధారణ అమ్మాయి మసూద ఆత్మ ఆవహించడం, ఆమెను కాపాడుకునేందుకు తల్లి నీలం (సంగీత), పక్కనే ఉండే గోపి (తిరువీర్) చేసే ప్రయత్నాలు సినిమాను ఆద్యంతం ఉత్కంఠగా నడిపించాయి. తిరువీర్ సహజ నటనతో పాటు, కీలక పాత్రలో నటించిన నటి సంగీత అద్భుతమైన పెర్ఫార్మెన్స్ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. అలాగే కావ్యా కల్యాణ్‌రామ్, తుభలేఖ సుధాకర్ తదితరుల నటన కూడా చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ, పకడ్బంది స్క్రీన్ ప్లే మరియు నేపథ్య సంగీతంతో ప్రేక్షకులకు సరికొత్త హారర్ అనుభూతిని పంచింది 'మసూద'. ఈ సినిమా ఘన విజయం తిరువీర్ కెరీర్‌ను మలుపు తిప్పడమే కాకుండా, టాలీవుడ్‌లో కొత్త తరహా హారర్-థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త ఊపునిచ్చింది. విడుదలై ఇన్ని ఏళ్లు గడుస్తున్నప్పటికీ, ఈ సినిమా అందించిన భయంతో కూడిన థ్రిల్ మాత్రం ప్రేక్షకుల మదిలో అలాగే నిలిచిపోయింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ ఎప్పుడా అని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.